ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 23.0

రాయితీపై రుణాలతో..
ఆర్థిక పురోభివృద్ధి

» బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వెనుకబడిన కులాల అభ్యున్నతికి ఆర్థిక పురోభివృద్ధి దిశగా ఏపీ ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వివిధ సామాజిక వర్గాల కోసం కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఆర్థికంగా చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే వెనుకబడిన తరగతులకు చెందిన వారికి ఈడబ్ల్యూఎస్ వర్గాలకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పించ నున్నారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. ప్రస్తుతం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. రాయితీ రుణాలను సద్వినియోగించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత కోరారు.

• **ఎన్ని శ్లాబ్‌ల విధానం అమలు చేస్తున్నారు?**

జవాబు : జిల్లాలోని వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ద్వారా దరఖాస్తులు స్వీకరించాం. మూడు శ్లాబ్‌ల విధానం ప్రభుత్వం అమలు చేస్తుంది. ఒకటో శ్లాబ్ కింద యూనిట్ విలువ రెండు లక్షల్లోపు ఇందులో రూ.75 వేలు సబ్సిడీ, రెండో శ్లాబ్‌లో యూనిట్ విలువ రెండు నుంచి మూడు లక్షల వరకు ఉంటుంది. ఇందులో రూ.1.25 లక్షల రాయితీ, మూడవ శ్లాబ్‌లో యూనిట్ విలువ మూడు నుంచి ఐదు లక్షల వరకు ఇందులో రెండు లక్షల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

• **శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నారా ?**

జవాబు : యూనిట్‌లు కేటాయించడమే కాకుండా వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించేలా నిపుణుల చేత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వమే చేపట్టనుంది. ఇప్పటికే లబ్ధిదారులు ఎంచుకున్న రంగంపై వారికి అవగాహన ఉంటే మరింత శిక్షణ ఇప్పించే ప్రయత్నం అధికారులు సిద్ధం చేస్తున్నారు.

• **ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు అందాయి ?**

జవాబు : ఇప్పటివరకు 33,602 దరఖాస్తులు స్వీకరించాం. దశల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం.

• **క్షేత్రస్థాయి సర్వే పూర్తయ్యిందా ?**

జవాబు : అగ్రవర్ణాల్లో ఆర్థికంగా అట్టడుగున ఉన్న వారి సంఖ్య తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసింది. ఈబీసీ కేటగిరీలో వచ్చే రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, కాపుతోపాటు ఇతర కులాల్లో ఉండే పేదల జాబితాను రూపొందించింది. వీరి వద్ద నుంచి రాయితీ రుణాలు కోసం దరఖాస్తులు స్వీకరించారు.

• **మహిళల కోసం ఏ యూనిట్‌లు ఉన్నాయి ?**

జవాబు : రాయితీ రుణాల విషయంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం ఉంది. ఎక్కువ శాతం మహిళలకు సంబంధించి నవే ఫ్యాషన్ డిజైనింగ్, బోటిక్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్ వంటివన్నీ ఎక్కువ శాతం మహిళలు రాణిస్తున్న రంగాలే. వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

- ఏలూరు రూరల్



గుదిబండలు!
అక్కరకు రాని గొడౌన్లు

» వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రైతుల అవస్థలు
» పూర్తికాని నిర్మాణాలు
» సొసైటీలకు అప్పులే మిగిలాయి
» రైతులే లేని ఏలూరులో రెండు అవసరమా?

వినియోగంలోకి రాని ముసునూరు మండలం గోపవరంలోని గొడౌన్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

హంగు ఆర్భాటాలకు పోయి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సొసైటీ గొడౌన్ల నిర్మాణాలు అక్కరకు రాకుండా పోయాయి. రైతుల అవసరాలకు తగ్గట్టుగా ధర లేని సమయంలో ఉత్పత్తులు నిల్వ చేసుకుని.. ఆ తర్వాత మార్కెట్ రేటు ఆశాజనకంగా ఉంటే పంటలను అమ్ముకునే వెసులుబాటుకు గొడౌన్‌లు ఉపయోగం పడాల్సి ఉంది. అయితే వైసీపీ పాలకులు అనాలోచిత నిర్ణయాలతో ఇష్టారాజ్యంగా సొసైటీల పాలక వర్గాలను సంప్రదించకుండా రైతుకు అందుబాటులో గొడౌన్ ఉందా? లేదా అనేది మరిచి వీటిని నిర్మించేశారు. తీరా ఆచరణలో అవి రైతులు ఉపయోగం లేకుండా పోయాయి. అప్పుడు చేసిన అప్పులు ఇప్పుడు సొసైటీలకు గుదిబండలుగా మారాయి.

2022 నుంచి 2024 మధ్య జిల్లాలో 500, 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గొడౌన్లకు మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో టెండర్లు పిలిచి 43 గొడౌన్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో కేవలం 22 పూర్తి అయ్యాయి. మరో 21 గొడౌన్లు వివిధ దశల్లో ఉన్నాయి. 500 మెట్రిక్ టన్నుల గొడౌన్‌కు రూ.40 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గొడౌన్ నిర్మాణానికి రూ.80 లక్షల చొప్పున ఆప్కాబ్ ద్వారా నాబార్డు రుణంతో వీటి నిర్మాణం చేపట్టారు. తీరా ఎక్కడా పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో ఈ రుణం ఎలా తీర్చాలో సొసైటీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మరోవైపు రైతులకు అందుబాటులోకి ఈ గొడౌన్లు నిర్మించాల్సి ఉండగా, అప్పటి వైసీపీ స్థానిక నాయకుల జోక్యంతో రోడ్డుకు దూరంగా పంట ఉత్పత్తులు తరలించేందుకు అనువు గాని చోట్ల నిర్మించారు. పేరుకే ప్రాథమిక సహకార సంఘాలకు నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి స్థానిక వైసీపీ నాయకులే అంతా తామై వ్యవహరించి అసలు లక్ష్యానికి తూట్లు పొడిచారన్న ఆరోపణలున్నాయి.

త్వరలో పూర్తి చేస్తాం

జిల్లాలో మొత్తం 43 గొడౌన్లకు గాను ఐదుచోట్ల స్థలాల వివాదాలు కోర్టుల్లో ఉండడంతో 38 నిర్మాణాలే ప్రారంభించాం. 33 గొడౌన్లు పూర్తయ్యాయి. అందులో కొన్నిచోట్ల పంట ఉత్పత్తుల కోసం ప్లాట్‌ఫారాలను నిర్మించాల్సి ఉంది. ఇటీవలే ఐదుచోట్ల నిర్మాణాలు నిలుపుదల చేశాం. త్వరలోనే ఆయా శాఖలకు ఈ గొడౌన్లు అప్పగిస్తాం. నిధుల విడుదల రాకపోవడంతో.. బిల్లులు కాంట్రాక్టర్లకు ఇవ్వకపోవడం కొంత జాప్యం జరిగింది.

టి.మల్లేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ డీఈ

రైతుల్లేని చోట్ల రెండు నిర్మాణం

ఏలూరు నగరంలో వ్యవసాయం చేసే రైతులు చాలా తక్కువ. చుట్టు పక్కల స్థలాలన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా రూపాంతరం చెందాయి. ఏదో కొద్ది మంది రైతులను ఆసరాగా చేసుకుని ఏలూరు టౌన్ విశాల పరపతి సహకార సంఘం పరిధిలో రెండు గొడౌన్‌లు నిర్మించేశారు. 2023-24 చివరలో వీటి నిర్మాణాలను వెంకటాపురం ఇందిరా కాలనీ, పోణంగి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఒక్కొక్కటి రూ.40 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. మాకు అవసరం లేదని చెప్పినా సొసైటీ పాలకవర్గం మాటలను వినకుండా ఏకపక్షంగా మంజూరు చేసేశారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. ఇప్పుడు ఈ సొసైటీ రూ.80 లక్షల పైనే భారం మోయాల్సి వస్తోంది. నిర్మాణం పూర్తయిన చోట్ల గొడౌన్లను జిల్లా సహకార శాఖకు అప్పగించాల్సి ఉన్నా అదీ జరగలేదు. పాత నిర్మాణాలపై అధి కారులు మాకెందులే అన్న ధోరణిలో ఉన్నారు. అటు సహకారశాఖ అధికారులు.. ఇటు మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎవ్వరికి వారే ఆగిన నిర్మాణాలపై దృష్టి సారించడం లేదు. వీటిపై డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న జేసీ ధాత్రిరెడ్డి దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

తీరిక ఏదీ?
పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తి

» పిల్లల్ని చదివించే ప్రయత్నం అంతంత మాత్రమే..
» కొనలేకపోతున్నారు.. ఆసక్తి పెంచలేకపోతున్నారు
» ఆంధ్రజ్యోతి సర్వేలో వెల్లడైన విషయాలు

■ లోపలి పేజీలో..

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఆవులయ్య

సారా రహితంగా 30 గ్రామాలను తీర్చిదిద్దాం

» నవోదయం -2 గ్రామసభలు విజయవంతం
» సారా తయారీదారులు 465 మంది అరెస్టు
» ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య

ఏలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఆదేశాలతో నవోదయం- 2 గ్రామసభల ద్వారా పెద్ద ఎత్తున 123 గ్రామాల్లో అవగాహన కార్య క్రమాలు నిర్వహించి, ఇప్పటి వరకు 30 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. శ్రీరామనగర్‌లోని జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ సూపరిం టెండెంట్ పాండురంగారావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జీవో 17 ప్రకారం సారా నిర్మూలకు నవోదయం -2 గ్రామ సభలను గత నెల ఆరున జిల్లాలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. సారా తయారు చేసే గ్రామాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, వీఆర్వో, ఎక్సైజ్ అధికారులు, డ్వాక్రా గ్రూప్ లీడర్లు, మహిళా పోలీస్‌లతో 123 గ్రామ కమిటీలను వేసి వారి ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం. జంగారెడ్డిగూడెం, పోలవరం, చింతలపూడి, నూజివీడు, భీమడోలు పరిసర ప్రాంతాల్లో 3 ప్రచార రథాలతో సారా నివారణకు చేయకపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలు, ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాలపై వివరిస్తున్నాం. కళాజాతాలతో సారా రక్కసితో ప్రాణాలు బలి చేసుకోవద్దని ప్రదర్శనలతో వివరిస్తున్నాం. సారా తయారీదారులు 479 మంది కేసులు నమోదు చేసి 465 మందిని తహసీల్దార్లకు బైండోవర్ చేశాం. ఇందులో 45 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 4,107 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బెల్లపు ఊట తయారు చేసి 731 మంది గుర్తించాం. వారిలో 129 మందిపై బైండోవర్ కేసులను పెట్టాం. సారా తయారీదారులకు బెల్లం అందించే 21 మంది వ్యాపారులపై నిఘా పెట్టాం. ప్రతీ 15 రోజులకు బెల్లం ఎవ్వరికీ అమ్మిందీ వివరాలను ఎక్సైజ్ స్టేషన్లలో నివేదికలను ఇవ్వాలని ఆదేశించాం. త్వరలో మరో 66 సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం. గ్రామసభలు పూర్తి అయ్యాక అక్కడి ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై కలెక్టర్ పర్యవేక్షణలో డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, ఐటీడీఏ అధికారులతో సమావేశం నిర్వ హించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తాం' అని తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షలు

జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో ఈ పరీక్షలు ఏలూరు శివారు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు కేంద్రంలో రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. ఉదయం 9గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం ప్రధాన ద్వారాన్ని మూసివేస్తామని నిర్వాహకులు ఇప్పటికే స్పష్టం చేసిన విషయం విదితమే. ఆ ప్రకారం ఉదయం షిఫ్టు పరీక్షకు 8.30 గంటల కంటే ముందుగానే, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 2.30 గంటల కంటే ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఈ నెల 2, 3, 4, 7, 8 తేదీల్లో ఇంజనీరింగ్, 9న బీఆర్క్, బీప్లానింగ్ ప్రవేశ పరీక్షలు ఉంటాయి. షిఫ్టునకు 160 మంది వంతున, 9న జరిగే పరీక్షకు 182 మంది అభ్యర్థులను కేటాయించారు. పరీక్షార్థులు తమవెంట అడ్మిట్ కార్డు, ఫొటోగుర్తింపు కార్డు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకెళ్లాలి. సెషన్-1 పరీక్షలు ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన విషయం తెలిసిందే.

మూడోవారంలో టెన్త్ ఫలితాలు!

» రేపటి నుంచి జవాబుపత్రాల మూల్యాంకన
» ముగిసిన పదో తరగతి పరీక్షలు
» 7నుంచి ఇంటర్ 'ప్రథమ' బ్రిడ్జి క్లాసులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారం నుంచి ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ప్రారంభమవుతుంది. స్పాట్ వాల్యూయేషన్ ఈనెల 9న ముగియనుండగా, తదుపరి ప్రక్రియలను పూర్తిచేసి ఫలితాలను ఈ నెల 20-25 తేదీల మధ్య ప్రకటించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. మార్చి 17 నుంచి ప్రారంభమైన టెన్త్ పరీక్షలకు రెగ్యులర్, వన్స్ ఫెయిల్డ్ విభాగాల్లో కలిపి మొత్తం 25,179 మంది దరఖాస్తు చేసుకోగా, సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విభాగంలో మరో 793 మంది అభ్యాసకులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణలో పకడ్బందీ చర్యలు తీసుకోవడం వల్ల సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన ఆరు హైస్కూళ్లతో సహా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా పరిశీలకుడు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ వివరించారు. కాగా మూల్యాంకన నిమిత్తం వివిధ జిల్లాల నుంచి మొత్తం 1.85 లక్షల జవాబు పత్రాలు అన్ని సబ్జెక్టుల నుంచి జిల్లాకు కేటాయించారు. స్పాట్ విధుల కోసం 140 మంది సీఈలు, 840 మంది ఏఈలు, 230 మంది స్పెషల్ అసిస్టెంట్లు, ఏడుగురు క్యాంపు ఆఫీసర్లను జిల్లా విద్యాశాఖ నియమించింది. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి సౌకర్యార్థం స్పాట్ క్యాంపు ప్రాంగణంలో సరిపడినన్ని ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, మూడు పూటలా వాటరింగ్ చేయాలని ఆదేశించామని జిల్లా పరిశీలకుడు కృష్ణారెడ్డి వివరించారు. శానిటేషన్, వైద్య శిబిరం ఉంటాయని, విద్యాశాఖ జారీచేసిన ఫొటోగుర్తింపు కార్డులు లేకుండా మూల్యాంకన కేంద్రంలోకి ఎవరినీ అనుమతించబోరన్నారు. ఒక్కో ఎగ్జామినర్ రోజుకి 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకన చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. చివరిరోజున మంగళవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు జిల్లాలో మొత్తం 22,704 మంది దరఖాస్తు చేసుకోగా 22,244 మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు.



ఏలూరులోని మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, డీఈవో

7నుంచి ఇంటర్మీడియట్ బ్రిడ్జి క్లాసులు

పదో తరగతి పరీక్షలు ముగియడంతో తదుపరి ఇంటర్ చదువుకు ఆటంకం లేకుండా ఆయా గ్రూపులు, పాఠ్యాంశాలపై అవగాహన కోసం ఈనెల 7నుంచి అన్ని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో బ్రిడ్జి క్లాసులను ప్రారంభించడానికి ఇంటర్మీడియట్ జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు స్థానికంగా ఉండే కళాశాలలకు హాజరుకావచ్చు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని వంద పడకల ఏరియా ఆస్పత్రులు జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి, 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కైకలూరు, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పోలవరం, బుట్టాయిగూడెం, దెందులూరు, భీమడోలు ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై 3వ తేదీ గురువారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు **70136 20539** నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ బి.పాల్ సతీష్‌కుమార్ చర్యలు తీసుకుంటారు.

93.22 శాతం
తొలిరోజు పింఛన్‌లు పంపిణీ

ఏలూరుసిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ తొలిరోజైన మంగళవారం సాయంత్రం 6గంటల సమయానికి 93.22 శాతం పూర్తి చేశారు. కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణలో సచివాయాల సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం 7గంటలకే ప్రారంభించారు. జిల్లాలో 2,60,195 మంది లబ్ధిదారులు ఉండ గా రూ.113.14 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం 6గంటల నాటికి డీఆర్ డీఏ అధికారుల నివేదిక ప్రకారం జిల్లాలో 2,42,548 మందికి (93.22శాతం) రూ.105.25 కోట్లు అంద జేశారు. ఇంకా కేవలం 19,068 మంది లబ్ధిదారులకు పంపిణీ జరగాల్సి ఉంది. ఏప్రిల్ 2వ తేదీ సాయం త్రంలోగా అందుబాటులో ఉన్న మిగిలిన పింఛన్ దారులు అందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు.



మాదేపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, చిత్రంలో ఏలూరు ఆర్డీవో అంబరీష్

మాదేపల్లిలో కలెక్టర్ అందజేత

ఏలూరు/ ఏలూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా నెలవారీ పెన్షన్లు పథకంలో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాదేపల్లిలో పర్యటించి మంగళవారం స్వయంగా పింఛన్ అందజేశారు. పెన్షన్ల పంపిణీని పరిశీలించారు. ఇంటి వద్దకే పెన్షన్ ఇస్తున్నారా? లేదా అంటూ లబ్ధిదారులను కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న భూముల రీ సర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 1507 ఎకరాల 98 సెంట్లు భూమి ఉండగా, రీ సర్వే ద్వారా ఆరు బ్లాక్స్ 250 ఎకరాలు వచ్చేటట్లుగా విభజించి రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు.భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలపై వచ్చిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2024-25లో ఇంత వరకు కోటి 23లక్షలు పనిదినాలు కల్పించామని కలెక్టర్ వెల్లడించారు. మాదేపల్లి పంచాయతీలో ఉపాధి పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో 3.77 లక్షల జాబ్‌కార్డులుండగా ఆర్థిక సంవత్సరంలో కోటి 20 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యంలో కోటి 23లక్షల మందికి పనిదినాలు కల్పించి, 103 శాతంకు చేరుకున్నామన్నారు. తమ్మిలేరులో పనిచేస్తున్న కూలీల దగ్గరకు కలెక్టర్ వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్డీవో అంబరీష్, డ్వామా పీడీ వెంకట సుబ్బారావు, తహసీల్దార్ శ్రీనివాస్, రీ సర్వే డీటీ నాగమణి, పంచాయతీ సెక్రటరీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

» జిల్లాలో 112 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్


ఏలూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మహిళా, శిశు అభివృద్ధి సంస్థలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల పోస్టుల భర్తీకి 10 సీడీపీవోల కార్యాలయాల నుంచి నోటిఫికేషన్ జారీ చేయడానికి కలెక్టర్, అంగన్‌వాడీ ఎంపిక కమిటీ చైర్మన్ కె.వెట్రిసెల్వి మంగళవారం ఆమోదించారని ఐసీడీఎస్ పీడీ పి.శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 అంగన్‌వాడీ వర్కర్లు, 7 మిని అంగన్‌వాడీ వర్కర్లు, 93 అంగన్‌వాడీ హెల్పర్లు భర్తీకి గౌరవ వేతనంపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఉంటున్న స్థానికులైన అర్హులైన మహిళా అభ్యర్థినులు 21 నుంచి 35 ఏళ్లలోపు వారు గడువులోగా దరఖాస్తులను స్థానిక సీడీపీవోలకు అర్హతా పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థినులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. సీడీపీవోలు ప్రకటించిన రోస్టర్ పాయింట్ల లోబడి ఎంపిక చేస్తామన్నారు. భీమడోలు వర్కర్ 1, హెల్పర్లు 13, బుట్టాయగూడెంలో వర్కర్లు 3, మినీ వర్కర్స్ 2, హెల్పర్లు 10, చింతలపూడిలో మినీ వర్కర్ 1, హెల్పర్లు 3, ఏలూరు మినీ వర్కర్ 1, హెల్పర్లు 15, జంగారెడ్డిగూడెంలో వర్కర్స్ 2, హెల్పర్లు 9, కైకలూరులో వర్కర్ 1, హెల్పర్లు 7, కొయ్యలగూడెం మినీ వర్కర్ 1, హెల్పర్ 8, కుక్కునూరులో అంగన్‌వాడీ వర్కర్ 1, హెల్పర్లు 6, నూజివీడులో హెల్పర్లు 8, పెదపాడులో వర్కర్ 4, మినీ వర్కర్లు 2, అంగన్‌వాడీ హెల్పర్లు 14 పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

అపర భద్రాద్రిలో రాములోరి కల్యాణానికి భారీ ఏర్పాట్లు



అపరభద్రాద్రి కల్యాణమూర్తులు

» ఈనెల 4వ తేదీ నుంచి 9 వరకు కల్యాణోత్సవాలు
» 6న సీతారామ కల్యాణం



చాట్రాయి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అపరభద్రాద్రిగా పేరు గాంచిన చాట్రాయి మండలం చనుబండ కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి 9 వరకు సుదర్శనం మాధవ శ్రీనివాసాచార్యులు యాజ్ఞికులు ఆధ్వర్యంలో పాంచాహ్నిక దీక్షతో సీతారాముల కల్యాణో త్సవాలు జరుగుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. 4వ తేదీ రాత్రి విష్వక్సేన పూజ, దీక్షా స్వీకరణ, పుణ్యాహవచన, మృద్‌సంగ్రహణ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజపట ప్రతిష్ఠ, 5న ఎదుర్కోలు ఉత్సవం (వధూవర అన్వేషణ), 6న సీతారామ కల్యాణం, స్వామికి గరుడోత్సవం, 7న మహాపట్టాభిషేకం, అన్న సమారాధన, రాత్రి 11.45 గంటలకు రథోత్సవం, 8న మధ్యాహ్నం 2.45 గంటలకు వసంతోత్సవం, రాత్రి 8.48 గంటలకు పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, అనంతరం దీపోత్సవం, 9న ద్వాదశ ప్రదక్షణలు, రాత్రి 8.35 గంటలకు పవళింపు సేవ జరుగుతుందని చెన్నకేశవ రెడ్డి వివరించారు.

ఆటిజం.. శాపమా!

» ఇది వ్యాధి కాదు .. పిల్లల్లో కనిపించే మానసిక లక్షణం
» పెరుగుతున్న ఆటిజం పిల్లల సంఖ్య
» మానసిక ఎదుగుదల ఉండదు
» మాటలు రావు.. ఇతరులతో కలవలేరు
» నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం

■ లోపలి పేజీలో..

ఇంటి వెనుక నుంచి వచ్చి
కాజేశారు..

లక్ష్మణేశ్వరంలో చోరీ.. వృద్ధ దంపతుల ఇంట్లో 20కాసుల బంగారం అపహరణ

హమ్మయ్య... పరీక్షలు అయిపోయాయ్ !











పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష పూర్తవడంతో విద్యార్థులంతా పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకు వచ్చారు.. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులైతే పెట్టె సర్దుకుని ఇళ్లకు బయలుదేరారు.. తల్లిదండ్రులు, బంధువులు వారి పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.. ఏలూరులో వివిధ ప్రాంతాల్లో దృశ్యాలివి.. - ఫొటోగ్రాఫర్, ఏలూరు

మా తరంలో అర్ధ రూపాయికి అరువుకి అద్దెకు కొనుగోలు చేసి పుస్తకాలు కొన్నాం.. కాలంతో మేము పరుగులు పెట్టలేం. పుస్తకాల కోసం పరుగులు పెట్టలేం. పిల్లల్ని చదవమని చెప్పగలం.. ఈ పుస్తకమే చదవాలన్న వారికి కోరిక, తీరిక, ఏకాగ్రత ఉండడం లేదు. ఇదీ నేడు పుస్తకాలపై ఉన్న ఉన్నశ్రద్ధ అని పలువురు పెదవి విరిచారు. .కేజీ నుంచి పీజీ వరకు పిల్లలు, యువకులు సెల్‌ఫోన్, టీవీ వీక్షణపై, సోషల్ మీడియా, ఛాటింగ్‌లపైనే ధ్యాస పెరుగుతోంది. సైన్సు, సమాజం, ఇతరత్రా మంచి, చెడులపై దృష్టి పెట్టడం లేదు. కనీసం మ్యాగజైన్లు, ఇతర పుస్తకాల్లో వచ్చే నీతి కథలు, బాలభారతం కథలు లాంటివి కూడా కనీసం చూసే తీరిక లేదు. రోజూ స్కూళ్లలో ఇచ్చే హోంవర్కులు, ఇతర ఎసైన్‌మెంట్‌లపై కుస్తీ పడుతున్నారే తప్ప సమాజం, సైన్సు, ఇతర రంగాలపై మక్కువ చూపడం లేదు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో 100 మందికి పైగా తల్లిదండ్రులను 'ఆంధ్రజ్యోతి' పుస్తకాలు చదవడం, పిల్లలకు కొనివ్వడం తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసింది. ఆ సర్వేలో వారు వెలిబుచ్చిన వివరాల ఆధారంగా తేలిన సారాంశం ఇదీ.. - (ఏలూరు/ భీమవరం టౌన్- ఆంధ్రజ్యోతి)

తీరిక ఏదీ?

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



• స్కూల్స్‌లో లైబ్రరీ అవర్ పెట్టాలి



నేను స్టోరీస్, సైకాలజీ, యద్దనపూడి రచనలు ఒకప్పుడు బాగా చదివేదాన్ని. ఇప్పుడు ఒక ఆత్మకథ, అబ్దుల్ కలాం పుస్తకాలు, స్వామి వివేకానంద పుస్తకాలు చదువుతున్నా.. మా వారు తాళపత్ర గ్రంథాలు, ఇతర పుస్తకాలు ఇంట్రస్ట్‌గా చదువుతారు. మా అబ్బాయి ఇషాన్ 8 తరగతి చదువుతున్నాడు. పంచతంత్ర, ధర్మపరిచయం కథలు చదివిస్తాను. బయట నుంచి ఎక్కువగా కొని ఇస్తాను. లైబ్రరీ అవర్ 45 నిమిషాలు ప్రతీ స్కూల్‌లో అమలు చేయాలి. ఒకప్పుడు లైబ్రరీ అవర్ ఇచ్చేవారు. బుల్లెట్ పాయింట్లతో రాయించే వారు. ప్రతీ స్కూల్‌లో రీడింగ్‌కు ఒక పీరియడ్ (లైబ్రరీ అవర్) ఇచ్చి అన్ని బుక్స్ అందుబాటులో ఉండాచాలి. తద్వారా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు పెరుగుతుంది.

డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, మహిళా,శిశు సంక్షేమశాఖ,జిల్లా బాలల సంరక్షణాధికారి


• నా ఇంట్లో 400 పుస్తకాలున్నాయి




నాకు 20 ఏళ్ల వయసు నుంచి పుస్తకాలు చద వడం వ్యాపకంగా మారింది. స్వామి వివేకానంద, మహాభారత, రామాయణ గాథలు, రమణ మహర్షి ఆశ్రమ లేఖలు, సైకాలజీ, బీవీ పట్టాభి రామ్,సినిమా హీరోలు మురళీమోహన్, శోభన్ బాబులు పుస్తకాలు చదివా.ఇటీవల కాలంలో సుఖనిద్ర పుస్తకం చదివా. టీవీ,సెల్‌ఫోన్లతో నిద్ర కరువైన రోజుల్లో ఈ పుస్తకాలు నిద్రకు ఉపక్రమించడంపై పలు చిట్కాలు ఉపయోగపడుతున్నాయి. నా దగ్గర ఉన్న పుస్తకాలను అనాధలకు, మెడిటేషన్ పుస్తకాలను తూర్పుగోదావరి జిల్లా లైబ్రరీకి ఇచ్చా. పుస్తకం పంచడం అంటే జ్ఞానాన్ని పంచడమే. నా ఇంట్లోని ర్యాక్‌లో 400 పుస్తకాలున్నాయి. శివాజీ మహరాజ్ కథలు, సర్వీస్ మేటర్స్ ఇతర రచయితలు పుస్తకాలు అన్నీ ఉన్నాయి. నా పిల్లలు చిన్నప్పటి నుంచి చదవే అలవాటు ఉంది.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.పాండురంగారావు, ఏలూరు


పిల్లలు పుస్తకాలు చదువుతారా




పిల్లలకు పుస్తకాలు కొంటారా



చిన్నతనంలో పుస్తకాలు చదివారా



పుస్తకాలు బహుమతిగా ఇచ్చారా



పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తి

పిల్లల్ని చదివించే ప్రయత్నం అంతంత మాత్రమే..

పుస్తకాలు కొనలేకపోతున్నారు.. ఆసక్తీ పెంచలేకపోతున్నారు

ఆంధ్రజ్యోతి సర్వేలో వెల్లడైన విషయాలు



ఉమ్మడి జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో 100 మందికి పైగా వివిధ వర్గాల నుంచి వివరాలు సేకరించాం. పుస్తకాలు చదువుతారా అని అడిగిన ప్రశ్నకు వీరిలో 66 శాతం మంది మాకు చదివే తీరిక లేదని గతంలో చదివే వాళ్లం అని చెప్పు కొచ్చారు. అడపా, దడపా ఆధ్యాత్మిక, ఉద్యోగ, హెల్త్ టిప్స్ పుస్తకాలు చదువుతున్నట్టు చెప్పారు. ఇక పిల్లలకి పుస్తకాలు కొంటారా అని అడిగితే అవసరమైనవి కొని ఇస్తామని 60 శాతం మంది, మరో 40 శాతం మంది కొని ఇవ్వడం లేదని వివరించారు. స్కూల్లో సిలబస్‌తోనే వారికి సమయం సరిపోవడం లేదని చెప్పుకొచ్చారు ఏమాత్రం సమయం చిక్కినా వారిని చెస్, క్యారమ్స్, క్రికెట్, ఇతర క్రీడల్లో శిక్షణ కోసం పంపిస్తున్నామని చెప్పుకొచ్చారు. మీరు చిన్నతనంలో పుస్తకాలు చదివారా అని అడిగితే 70 చదివామని 30 మంది చదవలేదని సమాధానం ఇచ్చారు.. అంటే ఆ కాలంలో పుస్తకాలు ఎక్కువగా చదివినట్టు అర్థం చేసుకోవచ్చు.. ఎందుకంటే ఫోన్లు ఇతర వ్యాపకాలు ఉండేవి కావు.. గ్రంథాలయాకు వెళ్లి చదువుకునే వారు ఎక్కువగా ఉండేవారు..ఎవరికైనా పుస్తకాలు బహుమతిగా ఇచ్చారా అని అడిగితే ఇచ్చామని 25 శాతం మంది సమాధానం ఇవ్వగా 75 శాతం మంది ఇవ్వడం లేదని చెప్పారు..ఇప్పుడు పుస్తకాలు బహుమతిగా ఎవరు ఇస్తున్నారని ఇచ్చినా ఎవరు చదువుతున్నారని ప్రశ్నించారు.

• ఆధ్యాత్మిక పుస్తకాలతో ఎంతో ఆనందం..



ఆధ్యాత్మికంగా, మానసిక ప్రశాంతత కోసం నేను స్వామి వివేకానంద, రామకృష్ణ పరమ హంస పుస్తకాలతో పాటు ఒక యోగి ఆత్మ కథలు చదవాను. వీటితో మానసిక ప్రశాంతత లభించింది. పంచాయతీరాజ్ చట్టం, సర్వీస్ రూల్స్, ఆర్‌టీఐ, ఏపీ సబార్డినేట్ రూల్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొని చదువుతుంటాను. వీటి వల్ల తోటి ఉద్యోగులకు సమస్యలు వచ్చినప్పుడు అధిగమించడానికి ఉపయోగపడ్డాయి. పేదలకు, అనాథలకు పుస్తకాలు కొని అందిస్తుంటాను. పుస్తకాలు పంచడం ఒక సామాజిక సేవలాంటిదే

తాడిమేటి వెంకట కిశోర్, ఉద్యోగి,ఏలూరు

• పుస్తకాలతో మోటివేషన్ పొందా..



నా చిన్నతనం నుంచి పుస్తకాలు చదివే అలవాటు ఉంది. మార్కెటింగ్ రంగంలో ఉన్నతంగా ఎదగడానికి నేను ది ఫైర్, యండమూరి వీరేంద్రనాథ్ విజయానికి ఐదు మెట్లు చదివా. బిజినెస్ సక్సెస్ కోసం వేణు భగవత్ రచనలు ఎక్కువగా చదివాను. మనీ పర్స్ , డబ్బు ఆదా మార్గాలపై ఈ పుస్తకం నాకెంతో ఉపయోగపడింది. నాకు నాలుగేళ్ల పాప ఉంది. ఆమెకు వివిధ బొమ్మలతో కూడిన పుస్తకాలు కొని ఇచ్చాను.

విజయ్ కుమార్, మార్కెటింగ్ ఉద్యోగి, ఏలూరు

• సెల్‌ఫోన్‌తో పుస్తక పఠనం పోయింది



పూర్వం ఎవరి ఇంట్లో చూసినా పుస్తకం చదువుతూ కనిపించేవారు. ఇప్పుడు ఎక్కడచూసినా సెల్‌ఫోన్ చూస్తు కనిపిస్తున్నారు. పుస్తకపఠనమే మరిచిపోయారు. తల్లిదండ్రులు కూడా చెప్పడం లదు. పిల్లల చేత చారిత్రాత్మక వ్యక్తుల జీవితాలకు సంబంధించిన పుస్తకాలు చదివిస్తేవారి పై మంచి ప్రభావం కనిపిస్తుంది. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి.

చెరుకువాడ రంగసాయి, సోషల్ వర్కర్, భీమవరం

• పిల్లలను గ్రంథాలయాలకు తీసుకువెళ్లాలి



పిల్లలను తప్పని సరిగా గ్రంథాలయాలకు తల్లి తండ్రులు తీసుకువెళ్లాలి. దీనివల్ల పుస్తకపఠనంపై ఆసక్తి పెరుగుతుంది. సెలవు రోజుల్లో పార్కులకు ఎలా తీసుకువెళ్తారో ఒక రోజైనా గ్రంథాలయాలకు తీసుకువెళితే వారికి ఆలోచన మారుతుంది. పుస్తక పఠనం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. పఠనం లేకపోతే భవిష్యత్తులో పుస్తకం అంటే తెలియ పరిస్థితి వచ్చే అవకాశం ఉంది.

దాయన సురేష్ చంద్రాజీ, రిటైర్డ్ ప్రిన్సిపాల్, భీమవరం

పుస్తకాలే మంచి నేస్తాలు



సెల్‌ఫోన్‌కు దూరంగా రంగులతో బొమ్మలు వేస్తున్న పాలకొల్లుకు చెందిన రవి కుమార్ నాలుగేళ్ల కుమారుడు

పాలకొల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే బాలల భవితక మంచి బాటలు ఏర్ప డతాయన్నది పెద్దలమాట. పుస్తకాలే విజ్ఞాన గనులు అని పూజ్య బాపూజీ చెప్పేవారు. బాలల నీతి కథలు మనదేశంలోనే ప్రథమంగా వెలువడ్డాయి. బాలలను బాల సాహిత్యంవైపు ఆకర్షించడం, పుస్తక పఠనాసక్తిని కలిగించడం వంటి ఆశయాలతో ఏటా ఏప్రిల్ 2వ తేదీన అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నారు. విష్ణు శర్మ రచించిన 'పంచతంత్రం' కథలు తొలి బాలసాహిత్యం అని చెప్పవచ్చు. పుస్తక పఠనం బాలల వ్యక్తిత్వం వికసితమవుతుంది. తెలుగులో తొలిసారిగా జన వినోధిని పత్రిక (1875-85) బాలలకోసం ప్రత్యేక సంచికలు ప్రారంభించింది. 1947లో నాగిరెడ్డి, చక్రపాణిలు చందమామ మాస పత్రికను ప్రారంభించారు. బాల సాహిత్యానికి చందమామ బాటలు వేస్తే, బాలమిత్ర, బొమ్మరిల్లు బుజ్జాయి వంటి మాస పత్రికలు పిల్లలను ఎంతగానో అలరించేవి. సుప్రసిద్ధ రచయితలు రావూరి భరద్వాజ, ఇల్లిందల సరస్వతిదేవి, న్యాయపతి రాఘవరావు, ఏడిద కామేశ్వరరావు, తురగాజానకీరాణి వంటి వారు బాలల కోసం ప్రత్యేక చనలు చేశారు. పుస్తక పఠనంతో బాలల్లో సమాజం పట్ల అవగాహన ఏర్పడుతుంది. పిల్లలకు చిన్న చిన్న కథలు వినిపిస్తూండాలి. చిత్రాలు (బొమ్మలు)తో కూడిన ఆసక్తి కరమైన పుస్తకాలను పిల్లలకు ఇవ్వాలి. దీంతో చిన్నారులు పుస్తకాల పట్ల ఆకర్షితులవు తారు. జ్ఞానాన్ని వారసత్వంగా అంది స్తున్నది పుస్తకాలు మాత్రమే. ఇంట ర్నెట్‌లో పుస్తకాలు చదివే పిల్లల్లో సహజ ఎదుగుదల మంద గిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పుస్తకపఠనాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా స్వీకరించి పిల్లలతో చిన్నతనం నుంచి చదివించినప్పుడే బాల్యం మానసిక వికాసానికి దోహద పడుతుందని చెప్పవచ్చు.



నటీ నటులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఆకట్టుకున్న అనూహ్యం నాటకం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ఉగాది నాటిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి పాలకొల్లు నటినట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన అనూహ్యం నాటిక తండ్రి ఆస్తిని కాజేయడానికి కొడుకులు పన్నిన పన్నాగం ఎత్తులు ఆలోచింపచేసింది. నాటిక తిలకించిన ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ నటీనటులను అభినందించారు. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామా రావు, బీజేపీ నాయకుడు గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు.

అలివేరులో ఘనంగా మామిడికాయ పండుగ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలం నుంచి ఏటా అనవాయితీగా జరుపుకునే మామిడికాయల పండుగను మంగళవారం అలివేరులో కొండరెడ్డి గిరిజనులు సందడిగా చేశారు. పెద్దలు కరకాల సోమరాజురెడ్డి, చర్ల బుల్లెమ్మల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పండుగలో ఆడ, మగ, చిన్నా, పెద్దా తేడా లేకుండా జనాలంతా పాల్గొని డోలు కొయ్యలు, గిల్లకాయలతో ఆడుపాడుతూ నృత్యాలు చేశారు. కొండరెడ్లు మామిడికాయ పండుగను చేయకుండా మామిడికాయలను ముట్టుకోరు. పండుగ తర్వాతనే వాటిని తింటారు. అంతవరకు చాలా నిష్టగా ఉంటారు. మామిడికాయ పండుగతో పాటు దారి పండుగ, చింతల పండుగ, చిక్కుడు పండుగ, పప్పు పండుగలను చేస్తారు. అన్నిటికంటే మామిడికాయల పండుగను ఘనంగా నిర్వహిస్తారు. పండుగ జరుపుకునే రోజున చుట్టుపక్కల గ్రామాలవారిని ఆహ్వానిస్తారు. పండుగలో అటవీ ప్రాంతంలో మాత్రమే దొరికే జీలుగు కల్లు, తాటికల్లు తప్పకుండా ఉంటుంది. పండుగకు వచ్చినవారందరికి కల్లు, మాంసం కూరలతో భోజనాలు పెట్టి ఇళ్ళకు పంపుతారు.



మామిడికాయల పండుగలో పాల్గొన్న కొండరెడ్లు

గుర్రపుడెక్కలో పోషకాలెన్నో

కంపోస్టు ఎరువు తయారీలో వినియోగం

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎందుకూ పనికిరాదు అనుకున్న గుర్రపుడెక్క నుంచి కూడా ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చరపోవాల్సిదే. కాలువలలో పేరుకుపోయి, నీటి ప్రవాహానికి అడ్డంగా మారి, పంటలను నాశనం చేస్తూ, రైతులను కన్నీరుపాలు చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఖర్చు రూపంలో తలనొప్పులు తీసుకు వస్తున్న గుర్రపుడెక్క వల్ల కూడా రైతులకు ఉపయోగాలున్నాయని చెబుతున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. సృష్టిలో పనికిరాని వస్తువే లేదు... ఉపయోగించుకోవడం తెలియక అన్న నానుడి అక్షర సత్యం చేస్తున్నది గుర్రపు డెక్క. గుర్రపుడెక్క తొలగించడానికి రైతులు, అధికారులు, ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానిని కంపోస్టు ఎరువుకు ఉపయోగించవచ్చునని అధికారులు తెలియజేస్తున్నారు. దీనిలో అనేక పోషకాలున్నాయి. గుర్రపుడెక్కను సేకరించి కంపోస్టు ఎరువు తయారు చేసి ఆదాయంగా మార్చుకోవచ్చని తెలియజేస్తున్నారు. గుర్రపుడెక్కలో నత్రజని, భాస్వరం (ఫాస్పరస్) పోటాషియం, సేంద్రీయ కర్బనం, బోరాన్, కాపర్, మాంగనీసు, నికెల్, జింకు, ఐరన్ ఉంటాయి. పశువులు వ్యర్థాలలో కన్నా ఎక్కువగా ఉంటాయి. వేసవికాలంలో వర్మీ కంపోస్టు తయారీ జరగదు. కాని గుర్రపుడెక్కతో సాధ్యమవుతుంది. ప్రధానంగా మొక్కలకు అవసర మైన నత్రజని 2.60% భాస్వరం (ఫాస్పరస్)1.5%, పోటాషియం 1.85, కాపర్ 100 ఎంజీ, ఐరన్ కే జీకి 1000 మి.గ్రా, జింక్ 100 మి.గ్రా లభిస్తుందని లెక్కల ద్వారా తెలుస్తున్నది. గుర్రపుడెక్క సేకరణ కూడా ఖర్చుతో కూడినది కాదు. కాలువలలో గుర్రపడెక్క అధికంగా కనిపిస్తుంది. గుబు రుగా ఉండే దీని వేర్లు నీటిలోని పోషకాలను పట్టి ఉంచుతాయి. సారవంతమైన మట్టిని కలిగి ఉంటాయి. కంపోస్టు తయారీకి పిట్‌ను ముందుగా ఏర్పాటు చేసుకోవాలి, దీనికే ఖర్చు అవుతుంది. కాలువలలో నుంచి గుర్రపుడెక్క సేకరించుకుని ముక్కలుగా చేసుకుని పశువుల వ్యర్థాలతో కలిపి పిట్‌లో వేసుకోవాలి. కంపోస్టు అవ్వడానికి రసాయనాలు ఉపయోగించుకుంటే ఏడు వారాలలో కంపోస్టు తయారవుతుంది. వేసవికాలంలో కూడా ఈ కంపోస్టు తయారు చేసుకోవచ్చు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఈ కంపోస్టు తయారు చేసుకోనే అవకాశాన్ని అప్పగించనున్నది. జిల్లాలో ఆకివీడు మండలం సిద్ధాపురంలో పైలెట్ ప్రాజెక్టుగా తయారు చేయడం ప్రారంభించనున్నారు. విజయవంతం అయితే ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు



ఖర్చు తగ్గుతుంది. వరదల సమయంలో అయితే దీనిని వల్ల ముంపు బారిన పడుతున్నాయి. యంత్రాలతో తొలగించాల్సి వస్తున్నది. ఈ ప్రక్రియ ప్రారంభిస్తే రైతులకు గుర్రపుడెక్క బాధ తగ్గుతుంది. సాగునీటి కోసం రైతులు కష్టాలు పడనవసరం లేదు. శివారు ప్రాంతాలకు సైతం సమృద్ధిగా నీరందుతుంది.

• ఆదాయం మార్గం

గుర్రపుడెక్కలో మేలు చేసే మంచి పోషకాలున్నాయి. అతి తక్కువ ఖర్చుతో దీనితో కంపోస్టు తయారు చేయవచ్చును. దీని ద్వారా సంవత్సరానికి రూ.1లక్ష వరకు ఆర్జించవచ్చును. దీని ద్వారా ఉపాధి కలుగుతుంది. రైతులకు పుష్కలంగా నీరందుతుంది, ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఖర్చు తగ్గుతుంది. ప్రతి గ్రామంలో కంపోస్టు పిట్‌లున్నాయి. వీటి ద్వారా కంపోస్టును తయారు చేసుకోవచ్చును.

వెంకటేశ్వరరావు, డీఏవో పశ్చిమగోదావరి జిల్లా



గురూ..ఐడియా అదిరింది !

బైకుకి గొడుగు సెట్టింగ్

అసలే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. బైక్‌పై బయటకు వెళ్లాలంటే వంట్లో నీరంతా ఆవిరై వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. కానీ పొట్టకూటి కోసం బయట తిరగక తప్పని పరిస్థితులు..ఎండ నుంచి తప్పించుకోవడం ఎలా అని ఆలోచించి ఇదిగో ఇలా సెట్టింగ్ చేశాడు.. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం పక్కిలంక గ్రామానికి చెందిన కంప్యూటర్ మెకానిక్ బాణాల సాయి నరసింహమూర్తి. తన బైకు హ్యాండిల్‌కి గొడుగు పెట్టుకునే విధంగా ఒక పైపుని తయారు చేయించి బైకుకి అమర్చాడు. దానికి మామూలు గొడుగైతే వేగానికి విరిగిపోతుంది పైగా పూర్తి నీడనివ్వదు. గొడుగు వెనుక తోకలా ఉండి వెనుక నుండి కూడా ఎండ తగలకుండా ఉండే గొడుగుని కొనుగోలు చేసి బైకుకి అమర్చాడు. ఎండ తగలకుండా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లి కంప్యూటర్లు రిపేరు చేస్తున్నాడు. - పోలవరం (ఆంధ్రజ్యోతి)


పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న సూర్యకుమారి

సాంకేతిక ఆధారిత పరిశ్రమలు రావాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాంకేతిక ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన పారిశ్రామిక వేత్తల నుంచి ఉత్పత్తి యూనిట్లు, ముడి సరుకుల సేకరణ, మార్కెటింగ్, బాంకు రుణాలు మంజూరు, పరిశ్రమల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర విషయాలను అడిగితెలుసుకున్నారు. పారిశ్రామికవేత్తలు ఎస్.దిలీప్ కుమార్ (కోకోనట్ క్లస్టర్), వెంకటేశ్వరరావు (మష్రూమ్‌పౌడర్), హరీష్ (చాక్లెట్ తయారీ), డాక్టర్ బాబు (ప్లాస్టిక్ చిప్స్), దుర్గారావు (ప్లాస్టిక్ వేస్ట్ నుంచి పీవీసీ పైప్స్ తయారీ), చైతన్య (ఆమోన్స్ పికిల్స్), వాసు (ప్రింటింగ్ క్లస్టర్), పాండు (ఫర్నిచర్ క్లస్టర్) , నారాయణ రావు ప్రోగ్రెసివ్ ఫార్మర్ తదితరుల సమావేశంలో సంబంధిత తయారీ ఉత్పత్తుల గురించి జిల్లా ప్రత్యేక అధికారికి వివరించారు. సమావేశం దృష్టికి తీసుకు వచ్చిన విషయాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణను రూపొందించి అమలు చేస్తానని జిల్లా యంత్రాంగం తరపున హామీ ఇచ్చారు. ప్రతినెల జిల్లా కలెక్టర్ తో కలిసి సమావేశం నిర్వహిస్తామన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులు తయారీలో పోటీ పడాలన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోం సర్వే పూర్తి చేయండి : కలెక్టర్

ఏలూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉండి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి వర్క్‌ఫ్రమ్ హోమ్ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు చేపట్టిన సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డీఎల్‌డీవోలు, ఎంపీడీవో లతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే, జీఎస్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.


వివరాలు చెబుతున్న ప్రభుత్వ వైద్యుల బృందం

విషమంగానే ఫార్మసిస్ట్ ఆరోగ్యం

ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడి

న్యాయం చేయాలని తల్లిదండ్రుల డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంకు చెందిన ఎన్.నాగాంజలి(ఫార్మసిస్ట్) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో మంగళవారం బోధనాసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అనస్థీషియా ఇన్‌ఛార్జి హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ నీలిమ విలేకరులతో మాట్లాడారు. రోజు రోజుకు ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నదన్నారు. గత నెల 28వ తేదీ నుంచి బాధిత యువతి ఆరోగ్యంపై ఫాలో అవుతున్నామన్నారు. బ్రెయిన్‌కు ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల డ్యామేజీ ఎక్కువగా జరిగిందని భావిస్తున్నామన్నారు. పేషెంట్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో వేరేచోటకు షిఫ్ట్ చేసే అవకాశం లేదని, ఆరోగ్య పరిస్థితి అంత క్రిటికల్‌గా ఉందన్నారు. బీపీ డౌన్ అవుతోందని, ఫీవర్ పెరుగుతున్నదన్నారు. జాండీస్ కూడా వచ్చిందన్నారు. బొల్లినేని ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పూర్తిస్థాయిలో జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇలా ఎన్ని రోజులు కండీషన్ ఉంటుందనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు మాజీ ఎంపీ భరత్‌రామ్, యాంకర్ శ్యామల, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆసుపత్రి ఐసీయూలో ఉన్న నాగాంజలిని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఇదే ఆసుపత్రిలో అంజలి ఇంజక్షన్ చేసుకుందని కానీ ఆ దృశ్యాలు రికార్డయిన సీసీ ఫుటేజీని మాత్రం ఇప్పటి వరకు బాధిత తల్లిదండ్రులకు ఇవ్వలేదన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నాగాంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డను మాతో ఆరోగ్యంగా పంపాలన్నారు. పది రోజులుగా ఎటువంటి మార్పులేదని మాలాంటి పరిస్థితి ఎవ్వరికి రాకూడదన్నారు.

విజయవాడ-మచిలీపట్నం రహదారిపై ప్రమాదం

మోటార్ సైకిల్‌ను ఢీకొన్నకారు.. పాలకొల్లు వాసులకు గాయాలు

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై చిట్టి గూడూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొల్లుకు చెందిన పి. దామోదర్‌రెడ్డి, సి. రామారావు, బేబీ, మరో మహిళ కారులో విజయవాడ నుంచి పాలకొల్లు వెళుతుండగా, విజయవాడకు చెందిన ఎస్. ఫణి తన ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఫణి ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో ఫణికి బలమైన గాయాలయ్యాయి. కారు వేగంగా వెళ్ళి పక్కనే ఉన్న పంట బోదెలో తిరగబడింది. కారులో ప్రయాణిస్తున్న దామోదర్‌రెడ్డి, రామారావు, బేబీ మరో మహిళకు గాయాలయ్యాయి. వీరిని బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఫణి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. గూడూరు ఎస్ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ రోడ్డు ప్రమాదాన్ని చూసి రోడ్డు మొత్తాన్ని సిబ్బందితో క్లియర్ చేయించారు. వెంటనే అంబులెన్స్‌లను సంఘటనా స్థలానికి పంపించారు.

'డైట్'లో అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దూబచర్లలోని డైట్(జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ)లో ఖాళీగా వున్న వివిధ సబ్జెక్టుల అధ్యాపక పోస్టులను ఫారిన్ సర్వీసు(ఎఫ్ఎస్‌టీసీ)పద్ధతిపై ఇన్‌సర్వీసు ఎంఈవో/హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్లతో పరిమితకాలానికి లోబడి డిప్యూటేషన్లపై భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న సంబంధిత కేడర్ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఏ ఉపాధ్యాయులు నియామకాల మార్గదర్శకాలను గూగుల్ లింక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.


మద్ది ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

ఆటిజం.. శాపమా!

» ఇది వ్యాధి కాదు.. పిల్లల్లో కనిపించే మానసిక లక్షణం » పెరుగుతున్న ఆటిజం పిల్లల సంఖ్య
» మానసిక ఎదుగుదల ఉండదు » మాటలు రావు.. ఇతరులతో కలవలేరు

నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం



తణుకు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆటిజం ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పదం. ఇది ఒక న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్. ఇది పిల్లల్లో కనిపించే లక్షణం. దీన్ని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అని పిలుస్తారు. అనేక మానసిక వ్యాధులలో ఉండే లక్షణాలు దీనిలో కనిపిస్తాయి. కాబట్టి దీన్ని స్పెక్ట్రమ్‌గా పిలుస్తారు. ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యంలో ఇది కనిపించడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పవచ్చు. ప్రతి 68 జననాలలో ఒకరికి ఆటిజం అనే డిజార్డర్ వస్తున్నట్టుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి.

ఆటిజం లక్షణాలు

సామాజిక నైపుణ్యాలు తగ్గిపోవడం. అంటే ఇతరులతో కలవలేకపోవడం, మాటలు రాకపోవడం, ముఖ్యంగా వచ్చిన మాటలు కూడా రెండు సంవత్సరాల వయస్సులో పోవడం, పలికిన పదం మళ్ళీ మళ్ళీ పలకడం (ఎకొలాలియా), కళ్లల్లోకి చూసి మాట్లాడకపోవడం (ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం) వంటి లక్షణాలు ప్రధాన ంగా కనబడతాయి. అయితే వీటితో పాటు కొన్ని ఇతర మానసిక సమస్యలు కూడా ఆటిజంతో కలిసి ఉంటాయి. దీని ని కో మార్బిడిటీ కండిషన్ అంటారు. ఏకాగ్రత లేకపోవడంతో పాటు హైపర్ యాక్టివిటీ (ఏడీహెచ్‌డి), బుద్ది మాద్య ం, లెర్నింగ్ డిజార్డర్ వంటి సమస్యలు కలిసినపుడు ఈ డిజార్డర్ మరింత ఇబ్బందికరంగా మారుతుంది.

ఇది ఎందుకు వస్తుంది..

ఆటిజం వ్యాధి కాదు. ఇది ఒక డిజా ర్డర్ మాత్రమే. అయినప్పటికీ దీనివల్ల పిల్లల అభివృద్ధి కుంటుపడుతుంది. ముఖ్యంగా నేర్చుకోవడంలో వెనుకబడతారు. సోషల్ స్కిల్స్ విషయంలో వెనుకబాటు ఉండటం వల్ల బంధాలు, అనుబంధాల విషయంలో వెనుకబాటు ఉంటుంది. ఇది పిల్లలలో రావడానికి ఇప్పటి వరకు స్పష్టమైన కారణాలు తెలియవు. ఇప్పటికీ దీని మీద పరిశోధన జరుగుతూనే ఉంది. అయితే అందుబాటులో ఉన్న సమాచారం మేరకు జీన్స్‌లో చోటు చేసుకునే లోపాలు అంటే వంశపారంపర్యం ఒక కారణం. అంతే కాకుండా ఆలస్యంగా (ఎక్కువ వయస్సు అంటే 30 కి పైబడిన వయస్సు) గర్భం దాల్చడం, తల్లిదండ్రులకు ఆల్కహాల్, సిగిరె ట్ స్మోకింగ్, డ్రగ్స్ వంటి అలవాట్లు ఉండటం ఒక కారణంగా చెప్పచ్చు. గర్భం ధరించినప్పటి నుంచి సమతుల ఆహారం, వాక్సినేషన్, గర్భం ధరించిన కాలం, డెలివరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఇతర మెడికల్ కారణాలు ఈ డిజార్డర్ రావడానికి ఒక ముఖ్య కారణం.

ఏ వయసులో గుర్తించవచ్చు...



దీనిని ఆరు నెలల వయస్సు ఉన్నపుడే గుర్తించవచ్చు. కానీ దురదృష్టవశాత్తు 6 సంవత్సరాల తరువాత కాలంలో ఎక్కువ మంది తల్లిదండ్రులు గుర్తించి నిపుణుల వద్దకు చికిత్స నిమిత్తం తీసుకువెళుతు న్నారు. దీని వల్ల ఫలితం తక్కువగా ఉంటుంది. ఆరు నెలల కాలంలో పిల్లవాడు వాడితో మాట్లాడుతున్న వాడితో ఐ కాంటాక్ట్ సరిగా లేనపుడు ఆటిజంగా అనుమానించ వచ్చు. అలాగే స్పీచ్ విషయంలో మొదటి 10 నెలల వయస్సు వచ్చే సరికి మొదటి పదం పలకడం వస్తుంది. అక్కడి నుంచి పదాలు పలుకుతారు. కానీ ఈ డిజార్డర్ ఉన్న పిల్లలు శబ్దాలు పలకడం, పదాలు పలకడం విషయ ంలో వెనుకబడతారు. కొంతమంది పిల్లల్లో అసలు పదాలు పలకని పరిస్థితి ఉండవచ్చు. అంతేకాదు శూన్యంలోకి చూస్తూ ఉంటారు. ఇలా చాలా సేపు చూస్తారు. ఇది ఇబ్బందికర పరిణామం. ఈ డిజార్డర్‌తో పాటు ఏడీహెచ్‌డీ కూడా కలిపి ఉన్నపుడు ఇతర పిల్లలను కొట్టడం, అల్లరి ఎక్కువ చేయడం, చెబుతున్న విషయాల పట్ల ఏకాగ్రత చూపలేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భంలో తల్లిదండ్రులు మేలుకోవాలి. సత్వ ర చికిత్సకు తీసుకు వెళ్ళడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

ఎలా నిర్ధారిస్తారు?

ఈ డిజార్డర్‌ను మొదట తల్లిదండ్రులు గమనించగలరు. వీరు నిపుణుడి వద్దకు వెళ్ళి తమ పిల్లల వెనుకబాటుకు కారణం అడిగినపుడు నిపుణుడు లక్షణాల ఆధారంగా నిర్ధారణకు రాగలడు. అయితే ఎం చాట్, ఈసా వంటి కొన్ని సైకోమెట్రీ పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయి. వాటి సహాయంతో డిజార్డర్ ఉందా... లేదా.. ఉంటే ఏ స్థాయిలో ఉంది అనే విషయాలను నిర్ధారించుకోవచ్చు.

- పశ్చిమగోదావరి జిల్లాలో 13 మంది ఆటిజం బాధితులు ఉన్నారని డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి తెలిపారు. తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం దృష్టికి రాని పిల్లలు వందల సంఖ్యలో ఉంటారని అంచనా.

త్వరగా చికిత్స అందిస్తే మంచి ఫలితాలు



దీన్ని పూర్తి స్థాయిలో తగ్గించడానికి చికిత్స అందు బాటు లో లేదనే చెప్పాలి. కానీ తొందరగా గుర్తించి చికిత్సను ప్రారంభిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పిల్లలకు 0 నుంచి 3 సంవత్సరాల వయ స్సు వరకు న్యూరోప్లాస్టిసిటీ అవకాశాలు ఎక్కువ ప్రయోజనాన్ని కలిగించేదిగా ఉంటుంది. ఈ సమయంలో చేసే చికిత్సలు వేగంగా ఫలితాల్ని ఇస్తాయి. దీని వల్ల పిల్లవాడు వీలైన స్వయం సమృద్ధి తన అవసరాల విషయంలో పొందుతారు. ఇక చికిత్సా పద్ధతుల గురించి ఆలోచిస్తే.. బిహేవియర్ మోడిఫికేషన్, సెన్సరీ ఇంటిగ్రేషన్, ఆక్యుపేషనల్ థెరపి, స్పీచ్ థెరపి అవసరం అవుతాయి. ఇలాం టి చికిత్సా విధానాలకు క్వాలిఫైడ్ నిపుణులను (రీ హేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేత గుర్తించబడి న) ఎంచు కోవడం వల్ల డబ్బు, సమయం ఆదా కావడమే కాకుండా పిల్లవాడి భవిష్యత్‌కు వీలైనంత మేలు చేసినట్లవుతుంది.

- యనమండ్ర రామకృష్ణ, క్లినికల్ సైకాలజిస్టు, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, తణుకు

వృద్ధురాలిపై దాడి చేసిన నిందితుడి అరెస్ట్

ఎనిమిది కాసుల బంగారం స్వాధీనం


నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసకావడంతో పాటు ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఎలాగైనా దొంగతనాలు చేసి భారీగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న ఒక యువకుడు చేసిన దొంగతనాన్ని పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భీమవరం గాంధీ నగర్‌కు చెందిన బి.విక్టర్ పాల్ కొంత కాలంగా ఖాళీగా ఉంటూ చెడు వ్యసనాలకు బానిసఅయ్యాడు. ఈ నేపథ్యంలోనే బేతనీపేట అమ్మిరాజు తోటలో నివాసముంటున్న భార్యా భర్తలు యర్రంశెట్టి మంగతాయారు- వీరాస్వామి నాయుడు ఇంటికి గత నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో విక్టర్ పాల్ వెళ్ళాడు. అద్దెకు ఇల్లు కావాలని, తాను దూరపు బంధువు అవుతానని, ఇంకా బంధువులు చూడటానికి వస్తున్నారని చెప్పి అక్కడే కూర్చున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో మంగతాయారు భర్త వాకింగ్‌కు వెళ్ళిపోయాడు. దీంతో ఒంటరిగా ఉంటున్న మంగతాయారుపై వెంట తెచ్చుకున్న చైనా బ్లేడుతో మెడపై దాడి చేసి మెడలో ఉన్న నల్లపూసలు, తాడు, సూత్రాలను లాక్కుని పరారయ్యాడు. వెంటనే స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించిన వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నాలుగు బృందాలుగా పోలీసులు గాలింపు చేశారు. నిందితుడు గుర్తులనుబట్టి మంగళవారం బ్రిడ్జిపేట వంతెన వద్ద విక్టర్ పాల్‌ను అరెస్ట్ చేసి 64 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ జయసూర్య, సీఐ నాగరాజు, సీసీఎస్ సీఐ రాంబాబు, వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్, పాలకోడేరు ఎస్ఐ రవివర్మ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కొడుకు దాడి చేశాడంటూ తల్లి ఫిర్యాదు

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భీమవరం బలుసుమూడికి చెందిన దేవరకొండ జ్యోతి భర్త ఐదేళ్ళ క్రితం మృతి చెందడంతో కుమారుడు, కుమార్తెతో ఉంటుంది. అయితే కుమారుడు ప్రభాకర్ వ్యసనాలకు బానిసై నిత్యం మద్యం సేవించి వచ్చి కొడుతున్నాడని, అలాగే చంపుతానంటూ బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గత నెల 29వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో ప్రభాకర్, వారి బంధువులైన వరప్రసాద్‌లు మద్యం సేవించి వచ్చి జ్యోతితో గొడవపడ్డారు. కత్తి తీసుకుని చంపుతానని బెదిరించడంతో ఆమె కంగారు పడింది. ఆమెకు కత్తి పిడి తగిలి గాయాలయ్యాయి. వెంటనే జ్యోతి చెల్లెలి నివాసానికి వెళ్ళి వైద్యం పొంది మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇజ్రాయెల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుమందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదపాడు మండలం సకల కొత్తపల్లి గ్రామానికి చెందిన సాకేటి సూర్యారావు (52)కు భార్య ఉన్నారు. వారికి సంతానం కలగలేదు. కాలేయం వ్యాధితో బాధపడుతున్నారు. మార్పిడి చేయడం కోసం దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో దాతలు దొరకకపోవడం, అనారోగ్య ంతో తీవ్రంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్తతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా కొద్దిసేపటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

కుక్కునూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగినిపై అత్యాచారానికి పాల్పడి ఆపై అప్పు తీసుకున్న డబ్బు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కుక్కునూరు సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయగూడెంకు చెందిన ఓ వివాహిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నది. కుక్కునూరు మండలం దామచర్లకు గ్రామానికి చెందిన గొడ్ల అజిత్ కుమార్ 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నాడు. వృత్తి రీత్యా వీరిద్దరి మధ్య ఉన్న స్నేహాన్ని ఆసరాగా చేసుకుని మహిళా ఉద్యోగిని వద్ద తన కుటుంబ అవసరాల నిమిత్తం పలు సార్లు రూ.1.5 లక్షలు తీసుకున్నాడు. కొన్ని రోజులు గడిచిన అనంతరం ఆ మహిళ తన డబ్బు ఇవ్వమని అడిగింది. ఈ క్రమంలో గత సంవత్సరం నవంబరు నెలలో ఓ రోజు రాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న మహిళ గదిలోకి వెళ్ళి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయం బయట ఎవరికైనా చెబితే ఆమెను అల్లరి చేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో తనకు రావల్సిన డబ్బులు అడుగుతుండగా ఆ మహిళపై అజిత్ కుమార్ చెడుగా ప్రచారం చేస్తు న్నాడు. దీంతో ఆ మహిళ మార్చి మూడవ తేదీన ఆత్మహత్యకు ప్రయత్ని ంచింది. అనంతరం కుటుంబ సభ్యులకు తెలియజే యడంతో వారు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో మార్చి 26 న ఫిర్యాదు చేయగా అజిత్ కుమార్ పై కేసు నమోదు చేశారు. మంగళవారం అజిత్ కుమార్ ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఇంటి వెనుక నుంచి వచ్చి కాజేశారు..

లక్ష్మణేశ్వరంలో చోరీ.. వృద్ధ దంపతుల ఇంట్లో 20కాసుల బంగారం అపహరణ


ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య, సీఐ దుర్గాప్రసాద్

నరసాపురం రూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం గ్రామంలోని సొసైటీ రోడ్‌లో మంగళవారం భారీ చోరీ చోటు చేసుకున్నది. రిటైర్డ్ ఉద్యోగి కె.సింహాచలం దంపతులు ఇంట్లో ఉండగానే దుండగులు ఇంటి వెనుక వైపు నుంచి వచ్చి 20 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుని పోయారు. రాత్రి వృద్ధ దంపతులిద్దరూ ఏసీ గదిలో పడుకున్నారు. మధ్య రాత్రిలో వృద్ధ దంపతులు మరో గదిలోకి వచ్చి తలుపులు తీసి నిద్రలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంటి వెనుక వైపు నుంచి వచ్చిన దండగులు బీరువాలోని ఆభరణాలను దొంగించారు. భీమవరం డీఎస్పీ జయసూర్య, నరసాపురం సీఐ దుర్గాప్రసాద్ సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును ఆరా తీశారు. జిల్లా నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. దొంగల్ని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకట సురేశ్ చెప్పారు. ఇదిలా ఉంటే పక్కా ప్లాన్‌గానే ఈ చోరీ జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వృద్ధ దంపతులిద్దరు ఇంట్లో ఉంటున్నారు. వీటన్నింటిని గమనించి ప్లాన్‌గా ఈ చోరీ చేసి ఉండొచ్చన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


పీహెచ్‌సీలో కార్మికుడికి సీపీఆర్ చేస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : దూర ప్రాంతం నుంచి బ్రతుకు తెరువుకు వచ్చిన కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా కేశవరం గ్రామానికి చెందిన బత్తుల వెంకటేష్(23) పెంటపాడు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ పనుల నిమిత్తం తన సహచరులతో నాలుగు నెలల క్రితం వచ్చాడు. మంగళవారం డ్రెయినేజీలో ఉన్న నీటిని మిషన్‌తో తోడుతుండంగా వైర్ ఎర్త్ కావడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తోటి సహచరులు అతడిని పెంటపాడు పీహెచ్‌సీకి తరలించగా అక్కడ సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికి ఫలితం కానరాలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

అత్తిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో జీడీఎం చర్చి వద్ద అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పంచా యతీ వారు జీడీఎం చర్చి వద్ద డ్రెయినేజీ పనులు జరుపుతుండగా ఆ పక్కనే చర్చికి సంబంధించిన వారు ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని తవ్వుతుండగా స్థానికులు ప్రశ్నించారు. దీనితో వారిపై ప్రతాప్, సతీష్, చినబాబు, సురేంద్ర, దిలీప్ తదితరులు దాడి చేసినట్లు తెలిపారు. దీనిపై మేడపాటి నాని ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

స్కూల్ వద్ద తల్లిదండ్రులు ఆందోళన

నరసాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని టీచర్ కొట్టడంతో తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. వీరికి ఎస్ఎఫ్ఐ సంఘీభావం తెలిపి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. దీంతో స్కూల్ వద్ద రెండు గంటల పాటు టెన్షన్ నెలకొంది. విద్యార్థుల్ని కొట్టడం, మానసిక వేధింపులకు గురి చేస్తున్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. చివరికి ప్రిన్సిపాల్ మరోసారి ఇటువంటి సంఘటనలు జరగనివ్వమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బంగారు పుస్తెలతాడు అపహరణ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన అప్పన రామాంజనేయులు తల్లికి చెందిన నాలుగు కాసుల బంగారు పుస్తెలతాడు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిటనట్లు హెచ్‌సి.మోషే తెలిపారు. మార్చి 30 వ తేదీన ప్రతీ రోజు లాగానే అప్పన రామాంజనేయులు తల్లి తన మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తీసి ఇంట్లో పెట్టి నిద్ర పోయారు. తర్వాత రోజు ఉదయం లేచి చూడగానే బంగారు పుస్తెలతాడు కనిపించకపోగా ఇంట్లో బీరువా కూడా తెరచి అందులో ఉన్న వస్తువులు చిందర వందరగా పడవేసి ఉండటం గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని మహిళ గాయపడిన సంఘటన రౌతుగూడెంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కొప్పుల నాగలక్ష్మి రహదారిపై నడిచి వెళుతుండగా బుట్టాయగూడెం వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు నాగలక్ష్మిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆమెను కామయ్యపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం తరలించారు.

యువకుడికి పాము కాటు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో యువకుడు ఆస్పత్రి పాలైన సంఘటన పి.అంకంపాలెంలో చోటుచేసుకు న్నది. గ్రామానికి చెందిన ఈడా మోహన్ మంగళవారం వేరుశనగ చేలో పని చేస్తుండగా గుర్తు తెలియని పాముకాటుకు గురయ్యాడు. అతడిని కామయ్యపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి 108లో తరలించారు.

ఉంగుటూరులో వ్యక్తిపై దాడి

ఉంగుటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరులో మంగళవారం రాత్రి మార్లపూడి ప్రసాద్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సేకరించవలసి ఉన్నదని చేబ్రోలు పోలీసులు తెలిపారు. ప్రసాద్ తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.

చెరువుల వద్ద మోటార్లు చోరీ

యలమంచిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మేడపాడు గ్రామం హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా తాను సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద ఉన్న 13 మోటార్లు సోమవారం రాత్రి చోరీకి గురైనట్టు ఆక్వా రైతు టి.నాగ ప్రసాద్ తెలిపారు. ఈ మోటార్లు విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందన్నారు. ఈమేరకు యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రసాద్ తెలిపారు.

మద్ది క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా మద్ది అంజనేయునికి వేకువ జాము నుంచి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. వివిధ సేవల రూపంలో స్వామివారికి రూ.లక్షా డెబ్బై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై ఒక్క రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.

8 నుంచి నగరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : నగరేశ్వర స్వామి ఆలయం వద్ద 8 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి నాగబాబు, ప్రధానార్చకులు చెరుకూరి వీడి మల్లికార్జునరావులు తెలిపారు. 8న స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకారణ, 11న సామూహిక కుంకుమ పూజలు, స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, 12న గ్రామోత్సవం, 13న వసంతోత్సవం, 14 పవళింపు సేవ ఉంటుందన్నారు.

లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నేడు సంగీత నీరాజనం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : శ్యామలశాస్త్రి, భద్రాచల రామదాసు జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక లేడీస్ రిక్రియేష్ క్లబ్‌లో సంగీత నీరాజనం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ఎం.రాంప్రసాద్ తెలిపారు. స్థానిక కళాకారులచే సంగీత నీరాజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కళాభిమానులు పాల్గొనాల్సిందిగా రాంప్రసాద్, జానకీ దంపతులు విజ్ఞప్తి చేశారు.

నీటి తొట్టెల నిర్మాణాలకు శంకుస్థాపన

కామవరపుకోట/జీలుగుమిల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులో ఉపాధి నిధులతో చేపట్టే పశువుల నీటి తొట్టెలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కామవరపు కోట మండలంలో 11 గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించేందుకు శంకుస్థాపన చేసినట్టు టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కామవరపుకోట మండలం కొండగూడెంలో నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.కృష్ణ, ఎం.కాంతారావు, జి.గోపి, అల్లూరి కృష్ణ ప్రసాద్, పి.శ్రీను, అడివికొట్టు మురళీ పాల్గొన్నారు.

3న స్వయం ఉపాధి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

పెదవేగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకం పొందడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 3వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు సంబంధించి ఎంపికైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయడానికి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశామన్నారు. లక్ష్మీపురం మార్కెట్ యార్డులో 3వ తేదీ ఉదయం 8గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలన్నారు.

బుట్టాయగూడెం మండలం నుంచి..

బుట్టాయగూడెం : స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 3న మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. బుట్టాయగూడెం మండలం నుంచి 176 మంది దరఖాస్తులు అందాయని అన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు ఒక జత జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై జగన్ తన వైఖరిని ప్రకటించాలి

పెదవేగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తన వైఖరిని బయటపెట్టాలని ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. పెదవేగిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తీర్మానం చేసినప్పటికీ జగన్ ఎటువంటి ప్రకటన చేయకుండా మిన్నకుండిపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జొన్నకూటి జాన్, కందుల రమేష్, కొత్తపల్లి మురళీకృష్ణ, మద్దాల తిరుపతిరావు, ఎం.ముక్కేశ్వరరావు, యర్రా ఆనంద్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదవేగి/ద్వారకాతిరుమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలని ఇఫ్టూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బద్దా వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదవేగి మండలం కూచింపూడిలో ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పాలకవర్గం సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూటమి నేతలు భవన నిర్మాణ కార్మికులకు అనేక హామీలిచ్చారని, వాటిని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ద్వారకాతిరుమల మండలం సి.హెచ్.పోతేపల్లిలో జరిగిన భవన నిర్మాణ కార్మికులు జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు ఆర్.లింగరాజు భవన నిర్మాణ కార్మి కులకు పనులు లేక వలస వెళ్తున్నారని తక్షణమే గృహ నిర్మాణ పథకం ద్వారా పేదలకు గృహాలు మంజూరు చేయా లని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠనం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరంలోని తొలి మంగళవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు తమలపాకులు, సిందూరంతో అర్చన జరిపి హనుమాన్ చాలీసా పారాయణను నిర్వహించారు.కోటదిబ్బ వద్ద ఉన్న గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పాండురంగ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి కోవెల వద్ద ఆలయ ధర్మకర్త రెళ్ల రామకృష్ణ అన్నప్రసాద వితరణ చేపట్టారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద, మినీ బైపాస్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద, పత్తేబాదలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నేడు ప్రమాణం

ఏలూరు టూటౌన్,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఏలూరు జిల్లా సీఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పెనుబోయిన మహేశ్ యాదవ్ తెలిపారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు.

ఫ్యాప్టో శాంతియుత నిరసనకు అనుమతి ఇవ్వండి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల శాంతియుత నిరసనకు పోలీసులు అనుమతినివ్వాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టింది. ఈ నిరసనకు పోలీసులు అనుమతిని మంజూరు చేయాలని సంఘ నాయకులు ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. శాంతియుతంగాచేపట్టే నిరసన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని డీఎస్పీకి వివరించారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఆదినారాయణ, నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాశ్‌రావు, రమేశ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


కె.గోకవరంలో నేడు ఎమ్మెల్యేతో ముఖాముఖి

లింగపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి చర్చించి వాటిని పరిష్కరించేందుకు కె.గోకవరంలో బుధవారం ఎమ్మెల్యేతో ముఖాముఖి నిర్వహించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు తెలిపారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ లింగపాలెం మండలం కె.గోకవరం టీడీపీ సీనియర్ నాయకుడు చాగంటి శ్రీమన్నారాయణ ఇంటివద్ద ఎమ్మెల్యేతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆముదాల అప్పలస్వామి కాలనీ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నవ్య సూచించారు. మంగళవారం కాలనీ ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనానికి కూల్ డ్రింక్‌లు, కూలింగ్ వాటర్, రోడ్డు పక్కన విక్రయించే చల్లని రంగునీళ్లు తాగరాదని హెచ్చరించారు. వీలైనంత వరకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, మంచి నీరు తీసుకోవాలని, లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలని కోరారు.గొడుగు, టోపీ, తలపాగా పెట్టుకోవాలన్నారు. శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, తీవ్రమైన జ్వరం, డీహైడ్రేషన్, వాంతులు, ఆయాసపడటం, ఫిట్స్ వంటి లక్షణాలన్నీ వడదెబ్బకు సంకేతాలేనన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ అమ్మవారికి పుష్పార్చన



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీనూకాలమ్మ 61వ ఉగాది వార్షిక జాతర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నూకాలమ్మకు పుష్పార్చనను ఆలయ చైర్మన్ రాజాన పండు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం విశ్వశాంతి కోసం ఆలయం వద్ద మహా పూర్ణాహుతి జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



లింగపాలెంలో చెట్టు కింద సేదతీరుతున్న విద్యార్థినులు



బుట్టాయగూడెం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న లక్కవరం ఎస్.ఐ. శశాంక

ముగిసిన టెన్త్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి.ఈ సందర్భంగా మండలంలోని లక్కవరం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు లక్కవరం ఎస్.ఐ. శశాంక పలు సూచనలు చేశారు. పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో సెలవుల్లో విద్యార్థులు భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఏవైనా స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. కొట్లాటలు, గొడవలకు వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పరీక్షలు ఫెయిల్ అయినా మళ్లీ రాసుకోవచ్చని, ఆత్మహత్యలకు పాల్పడి జీవితాలను కోల్పోవద్దని సూచించారు. అలాగే అమ్మాయిలు ప్రేమ పేరుతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని,

జాగ్రత్తలు సూచిస్తున్న పోలీస్ అధికారులు

సెలవుల్లో కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు.

● లింగపాలెం : టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. లింగపాలెం మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు.

● బుట్టాయగూడెం : మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 661 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 543 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 34 మంది పరీక్షలకు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి టి.బాబూరావు తెలిపారు.

● పోలవరం : మండలంలో చివరి రోజు టెన్త్ పరీక్షలకు 365 మంది విద్యార్థులకు గాను 353 మంది హాజరవగా 12 మంది గైర్హాజరైనట్టు ప్రధానోపాధ్యాయులు విజయ రాఘవన్, చంద్రశేఖర్‌లు తెలిపారు.

● కామవరపుకోట :చివరి రోజు జరిగిన సోషల్ పరీక్షకుగాను 17 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో డి.సుబ్బారావు తెలిపారు. 641 మంది హాజరుకావాల్సి ఉండగా 624 మంది హాజరైనట్టు తెలియజేశారు.

● టి.నరసాపురం : టెన్త్ పరీక్షలు మంగళవారంతో ముగిసినట్టు ఎంఈవో టి.రామ్మూర్తి తెలిపారు. మండలంలోని 476 మందికి గాను 17 మంది గైర్హాజరు కాగా 459 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. పరీక్షలు సక్రమంగా జరగడానికి కృషి చేసిన అధికారులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే(ఇన్‌సెట్‌లో జగన్ ఫొటో)

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో ఎదురుగానే జగన్ ఫొటో ఉన్న ఆరోగ్యశ్రీ బోర్డు ఉండటంపై గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ముఖ్యమంత్రి మారినా ఇంకా ఆ ఫొటో ఎందుకు తొలగించలేదంటూ ప్రశ్నించారు.

జగన్ ఫొటో ఉండటంపై ఎమ్మెల్యే అసహనం

ఆసుపత్రిని, పరిసరాలను, వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి ప్రభుత్వ పరంగా ఇంకా ఏమన్నా సాయం కావాలంటే మంజూరు చేయిస్తామన్నారు. ఈ నేపథ్యంలో తన సొంత ఖర్చుతో ఆసుపత్రికి కూలర్‌ను బహూకరించారు. రోగుల సౌకర్యార్థం దీనిని వినియోగించాలని కోరారు. అలాగే టిడిపి నాయకులు పది మంది ఆ ఆసుపత్రికి ఉచితంగా ఒక్కొక్కరూ ఒక్కో బెడ్, పరుపు, దిండ్లు రోగుల సౌకర్యానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీను, పాకలపాటి గాంధి, ఏపూరి దాలయ్య, ఇమ్మడి రత్నాజీ, జడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పాతూరి సహృదయ్, మద్దిపాటి రత్నాజీ పాల్గొన్నారు.

సారా కట్టడికి చర్యలు తీసుకోవాలి

చింతలపూడి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : సారా నిర్మూలన కోసం అధికారులు, గ్రామస్థుల సహకారం తీసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ యార్డులో ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన సారా రహిత అవగాహనపై మండల స్థాయి అధికారులు, ఎక్సైజ్, మహిళా పోలీసులు, వ్యాపారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అత్యధికంగా సారా తయారు చేసే గ్రామాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డులో చింతలపూడి సర్కిల్‌లోని కొన్ని గ్రామాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలో పాల్గొన్నారు. నగర పంచాయతీలో 78 లక్షలతో వేగిలింగేశ్వరస్వామి చెరువు గట్టుపై నిర్మించిన పార్క్ కం వాకింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, సి.హెచ్.ధర్మరాజు, దాసరి చంద్రశేషు, రావూరి కృష్ణ, సాయల సత్యనారాయణ, మాటూరి వెంకట్రామయ్య, మాజీ జడ్పీటీసీ రాధారాణి, కమిషనర్ పావని, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

పాడి రైతుల సంక్షేమానికి కృషి : చింతమనేని



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెదవేగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పశుపోషణకు ప్రాధాన్యం ఇస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.తాళ్లగోకవరంలో ఉపాధి నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రభాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. దీనిలో భాగంగా అర్హులైన రైతులకు మినీ గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తొలుత తాళ్ల గోకవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నెక్కలపూడి సురేష్ బాబు, ఏలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ నెక్కలపూడి రామచంద్రరావు, పార్టీ నాయకులు ఆలూరి హరికృష్ణ, వెలివెల నాగరాజు, తోట శ్రీనివాసరావు, ఈడ్పుగంటి అనిల్, కొనకళ్ల శివమణి, నున్నా జానకీరామ్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

జీలుగుమిల్లి/టి.నరసాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పోలవరం నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు రూ.20,57,566 సీఎం రిలీఫ్ ఫండ్‌ను విడుదల చేసినట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. గిరిజన ప్రాంతంలో కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కులను అందజేశారు. టి.నరసాపురం మండలం కేతవరం గ్రామానికి చెందిన యలమంచిలి ప్రసాద్‌కు గుండె సంబంధిత వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షా 51వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టి.నరసాపురం మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, చింతలపూడి నవీన్, వెలిది నాగబాబు, ఆయా మండలాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



దాతలకు బాండు అందజేస్తున్న దృశ్యం

శ్రీవారి ఆలయానికి లక్ష విరాళం

కొవ్వూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):ద్వారకాతిరుమల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి కొవ్వూరుకు చెందిన డాక్టర్ బొడ్డు అనసూయ(సూర్యదేవర) రూ.1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు సూర్యదేవర రంజిత్ కటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులకు విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు విరాళం బాండును అందజేశారు. టీడీపీ నాయకులు సూర్యదేవర రంజిత్, గీత, జాహ్నవి, సుహృత్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు కురాకుల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైన మురుగు, పేరుకున్న చెత్త..

ఇదీ మండల కార్యాలయాల వద్ద దుస్థితి
చర్యలు తీసుకోవాలంటూ ప్రజల విజ్ఞప్తి

దెందులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వం మారిన కింది స్థాయి సిబ్బంది సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దెందులూరు ఎంపీడీవో కార్యాలయం, బాల సదనం, మండల విద్యాశాఖ కార్యాలయం - తహసీల్దార్ కార్యాలయం ముందు బాలసదనంలో వాడకపు నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు దుర్వాసన రావడంతో పాటు పాదచారులు జారి పడుతున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని కార్యాలయం ఎదుట మురుగు నిల్వ లేకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట, తహసీల్దార్ కార్యాలయం పక్కన చెత్త పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని దెందులూరు మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ కార్యాలయం సమీపంలో మురుగు, చెత్త

చిన్నారుల సంక్షేమమే లక్ష్యం

పెదవేగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని పెదపాడు అదనపు సీడీపీవో సునీల్ రాజశేఖర్ అన్నారు. కొప్పాకలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలకు పంపాలన్నారు. సమావేశంలో సెక్టారు సూపర్‌వైజర్ శాంతా రత్నం పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

చింతలపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను కొనసాగించాలని నగర పంచాయతీ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని, మునిసిపల్ కార్మికుల వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ డి.పావనికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయు నాయకులు ఆర్.వి.సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు, టి.విజయరాజు, పద్మ, సలీం, కృష్ణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను రద్దు చేసి మునిసిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని, మునిసిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లావేటి కృష్ణారావు, జాన్‌బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బండి భవాని, నరమామిడి నాగమణి, నక్కా భాగ్యలక్ష్మి, హనుమంతరావు, జార్జి, వి.సోమయ్య పాల్గొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

క్రమం తప్పకుండా పింఛన్ల పంపిణీ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంక్షోభాలు ఎన్ని ఎదురైనా క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో అక్రమంగా తొలగించిన 99 వేల మంది లబ్ధిదారులకు తొలి విడతగా తిరిగి పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. మంగళవారం 19వ డివిజన్ ఎన్టీఆర్ కాలనీలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎంతోమంది అర్హుల పేర్లను తొలగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న తహసీల్దార్ రవి కుమార్

రహదారుల నిర్మాణంపై దృష్టి

ఉంగుటూరు, ఏప్రిల్ : 1(ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు.మంగళవారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశంలో మండలాధ్యక్ష, కార్యదర్శులతో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు. అలాగే ప్రారంభోత్సవాల్లో సర్పంచులు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్..

ఉంగుటూరు మండల తహసీల్దార్‌గా నియామకమైన పాలపర్తి రవికుమార్ ఎమ్మెల్యే ధర్మరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణ చంద్ర వర ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ పోతురాజు, ఆర్.ఐ.లు సాయి రమేశ్, రాజు సిబ్బంది పాల్గొని రవి కుమార్‌కు అభినందనలు తెలిపారు. అమరావతి సెక్రటేరియట్ మెడికల్ విభాగం నుంచి రవి కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఇంటర్వ్యూ..

బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కె.విజయలక్ష్మి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో, దెందులూరు



● **స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్టు పరిధిలో అందిస్తున్న పౌష్టికాహారం ఏమిటి?**

జవాబు : పెదపాడు ప్రాజెక్టు పరిధిలో 25 మినీ అంగన్వాడీ కేంద్రాలు, 216 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలోని 9 వేల 180 మంది చిన్నారులు, 3 వేల 234 మంది చిన్నారులు, గర్భిణులు ఉండగా వీరందరికీ సేంద్రియ పద్ధతిలో పండించే ఆకు కూరలు, కూరగాయలనే వండి అందిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలను వచ్చే చిన్నారులకు తాజా కూరగాయలను వండి వడ్డించగా గర్భిణులు, బాలింతలకు కూరగాయలు, ఆకు కూరలను అందిస్తున్నాం. మూడేళ్లలోపు చిన్నారుల ఇళ్లకు వెళ్లి బాలామృతం, పాలు, గుడ్లు అందిస్తున్నాం.

● **అంగన్‌వాడీ సొంత భవనాలున్నాయా?**

జవాబు : పెదపాడు ప్రాజెక్టు పరిధిలో 94 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవాలున్నాయి. దెందులూరు మండలం కొవ్వలి అంగన్వాడీ సెంటర్‌కు మాత్రమే విద్యుత్, తాగునీటి సమస్య ఉంది. మిగతావాటికి అన్ని సౌకర్యాలున్నాయి.

● **గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సరుకులేంటి?**

జవాబు : గర్భిణులు, బాలింతలకు నెలకు మూడు కేజీల రైస్, కేజీ కంది పప్పు, అరకేజీ నూనె, 2 కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, పావుకేజీ బెల్లం, పావు కేజీ ఎండు ఖర్జూరం, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు అందిస్తున్నాం.

● **విద్యాబోధనపై చర్యలేమిటి?**

జవాబు : ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆట పాటలతో ఆకర్షించేలా చిన్నారులకు ఆంగ్లంలో బోధిస్తున్నాం. పౌష్టికాహారం అందిస్తున్నాం. అంతా అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

- దెందులూరు,(ఆంధ్రజ్యోతి)

గణపతి వస్త్రాలకు బహిరంగ వేలం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని శ్రీలక్ష్మీ గణపతిస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలకు వేలం నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో భక్తులు సమర్పించిన పంచెలు, కండువాలకు రూ.13 వేల 495 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. చిననాగేశ్వరరావు తెలిపారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని ప్రసిద్ధి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో కె.తారకేశ్వరరావు తెలిపారు.దాత గంగిరెడ్డి లక్ష్మణరావు, గీతల ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించామన్నారు. మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆరుగురి అరెస్టు

లింగపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం శివారులో చిత్తులాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజీగూడెం శివారులో చిత్తులాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

సీతారాముడి విగ్రహాల ప్రతిష్ఠ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డికోపల్లెలో వనవాసి ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో రాముని పట్టాభిషేకం విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రాంత సహ నగరీయ ప్రముఖ్ రాధాకృష్ణ, పద్మావతి, వనవాసి కల్యాణాశ్రమం జిల్లా సమితి అధ్యక్షుడు సీతారామాంజనేయులు, కార్యదర్శి మోహన్, సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పరంగా రావాల్సిన పథకాల్లోకాని మరే ఇతర సౌకర్యాలపైన సమస్య ఏర్పడితే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని ఆ సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు వెంకటాపురంలోని ఎలీషా బ్లయిండ్ హోమ్‌ను మంగళవారం కార్యదర్శి రత్న ప్రసాద్ సందర్శించి మాట్లాడుతూ న్యాయ సహాయాన్ని పొందడానికి 15100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హోం మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి

కుక్కునూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలని కుక్కునూరు పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ కుటుంబానికి న్యాయం చెయ్యాలన్నారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. పాస్టర్లు సుధాకర్, సాయిబాబు, వసంత్ కుమార్, రాజ్‌కుమార్, దానియేలు, ఉన్నారు.

పైలట్ ప్రాజెక్టు రీసర్వేపై గ్రామ సభ

ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పైలెట్ ప్రాజెక్టు కింద భూముల రీసర్వే నిర్వహించిన చినకామనపూడిలో మంగళవారం రెవెన్యూ అధికార్లు గ్రామ సభ నిర్వహించారు. మండల డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామ సభలో ఆ గ్రామ ఏరియాలో సుమారు 532 ఎకరాల విస్తీర్ణంలోని భూముల హద్దులను నిర్ణయించేందుకు గత రెండు నెలలుగా నిర్వహించిన సర్వే వివరాలను అధికార్లు వెల్లడించారు. పలువురు రైతులు తమ భూముల విస్తీర్ణం తగ్గిందని, పేర్లు మారాయని అధికార్ల దృష్టికి తెచ్చారు. దీనిపై తాము భూముల వివరాలతో నోటీసులు ఇస్తామని, అభ్యంతరాలు ఉంటే 20 రోజులుగా తెలపాలని డీటీ తెలిపారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య, మండల సర్వేయర్ రాజశేఖరరెడ్డి, వీఆర్వో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లుడిపై అత్తింటివారు దాడి.. తీవ్ర గాయాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ తరచు తగాదాలు పడుతున్న ఒక కుటుంబం అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అత్తింటి వారు అల్లుడిని కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన వడాలిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొర్రా శివ కృష్ణ, అతని భార్య గౌతమి కొంతకాలంగా అప్పుల సమస్యలతో తగాదాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం శివకృష్ణను అతని భార్య గౌతమి, ఆమె తండ్రి, సోదరులు కలిసి కొబ్బరి మట్టలతో తీవ్రంగా కొట్టి గాయపరిచారు. దీనిపై శివకృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన శివకృష్ణను ఆసుపత్రిలో చేర్పించారు.

దేవపూడిలో...

గ్రామ పంచాయతీ చెరువుల వేలంపాట విషయంలో నెలకొన్న వివాదం ఓ వ్యక్తిపై దాడికి దారితీసింది. పోలీసుల కథనం ప్రకారం దేవపూడికి చెందిన వాజీ వెంకటేశ్వరరావుతో మంగళవారం అదే గ్రామానికి చెందిన మణి, అతని భార్య గొడవ పడ్డారు. ఈ సందర్భంగా తనను మణి దంపతులు కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండంగిలో రక్తదాన శిబిరం

కలిదిండి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొండంగిలో గ్రామ సంక్షేమ సేవాసమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తదానం చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు, గ్రామ సంక్షేమ సేవాసమితి సభ్యులు, సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, ఎంపీటీసీ లక్ష్మణరావు, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

తీరిక ఏదీ?

పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తి
పిల్లల్ని చదివించే ప్రయత్నం అంతంత మాత్రమే..
కొనలేకపోతున్నారు.. ఆసక్తి పెంచలేకపోతున్నారు
ఆంధ్రజ్యోతి సర్వేలో వెల్లడైన విషయాలు


నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



(ఏలూరు/ భీమవరం టౌన్- ఆంధ్రజ్యోతి)

మా తరంలో అర్ధ రూపాయికి అరువుకి అద్దెకు కొనుగోలు చేసి పుస్తకాలు కొన్నాం.. కాలంతో మేము పరుగులు పెట్టలేం. పుస్తకాల కోసం పరుగులు పెట్టలేం. పిల్లల్ని చదవమని చెప్పగలం.. ఈ పుస్తకమే చదవాలన్న వారికి కోరిక, తీరిక, ఏకాగ్రత ఉండడం లేదు. ఇది నేటి సమాజంలో బాలలు పుస్తకాలపై మమకారం పెంచుకుంటున్న తీరు... కేజీ నుంచి పీజీ వరకు పిల్లలు, యువకులు సెల్‌ఫోన్, టీవీ వీక్షణపై, సోషల్ మీడియా, ఛాటింగ్‌ల పైనే ధ్యాస పెరుగుతోంది. సైన్సు, సమాజం, ఇత రత్రా మంచి, చెడులపై దృష్టి పెట్టడం లేదు. కనీసం మ్యాగజైన్లు, ఇతర పుస్తకాల్లో వచ్చే నీతి కథలు, బాలభారతం కథలు లాంటివి కనీసం చూసే తీరిక లేదు. రోజూ స్కూళ్లలో ఇచ్చే హోంవర్కులు, ఇతర ఎసైన్‌మెంట్లపై కుస్తీ పడుతున్నారే తప్ప సమాజం, సైన్సు, ఇతర రంగాలపై మక్కువ చూపడం లేదు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో 100 మందికి పైగా వ్యక్తుల్ని 'ఆంధ్రజ్యోతి' పుస్తకాలు చదవడం, పిల్లలకు కొనివ్వడం తదితర అంశాలపై వారి అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసింది. ఆ సర్వేలో వారి వెలిబుచ్చిన వివరాల ఆధారంగా తేలిన సారాంశం ఇదీ..

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో 100 మందికి పైగా వివిధ వర్గాల నుంచి వివరాలు సేకరించాం. పుస్తకాలు చదువుతారా అని అడిగిన ప్రశ్నకు వీరిలో 56 శాతం మంది మాకు చదివే తీరిక లేదని గతంలో చదివే వాళ్లం అని చెప్పు కొచ్చారు. అడపా, దడపా ఆధ్యాత్మిక, ఉద్యోగ, హెల్త్ టిప్స్ పుస్తకాలు చదువుతున్నట్టు చెప్పారు. ఇక పిల్లలకి పుస్తకాలు కొంటారా అని అడిగితే అవసరమైనవి కొనిఇస్తామని 60 శాతం మంది, మరో 40 శాతం మంది కొని ఇవ్వడం లేదన్నారు. స్కూల్లో సిలబస్‌తోనే వారికి సమయం సరిపోవడం లేదని చెప్పుకొచ్చారు. ఏమాత్రం సమయం చిక్కినా వారిని చెస్, క్యారమ్స్, క్రికెట్, ఇతర క్రీడల్లో శిక్షణ కోసం పంపిస్తున్నామని తెలిపారు. మీ చిన్నతనంలో పుస్తకాలు చదివారా అని అడిగితే 70 చదివామని 30 మంది చదవ లేదని సమాధానం ఇచ్చారు.. అంటే ఆకాలంలో పుస్తకాలు ఎక్కువగా చదివినట్టు అర్థం చేసుకోవచ్చు.. ఎందుకంటే ఫోన్లు ఇతర వ్యాపకాలు ఉండేవి కావు.. గ్రంథాలయాకు వెళ్లి చదువుకునే వారు.. ఎవరికైనా పుస్తకాలు బహుమతిగా ఇచ్చారా అని అడిగితే ఇచ్చామని 20 మంది సమా ధానం ఇవ్వగా 80 శాతం మంది ఇవ్వడం లేదన్నారు.. ఇప్పుడు పుస్తకాలు బహుమతిగా ఎవరు ఇస్తున్నారని ఇచ్చినా ఎవరు చదువుతున్నారని ప్రశ్నించారు.



స్కూల్స్‌లో లైబ్రరీ అవర్ పెట్టాలి



నేను స్టోరీస్, సైకాలజీ, యద్దనపూడి రచనలు ఒకప్పుడు బాగా చదివేదాన్ని. ఇప్పుడు ఒక ఆత్మ కథ, అబ్దుల్ కలాం పుస్తకాలు, స్వామి వివేకానంద పుస్తకాలు చదువుతున్నా.. మా వారు తాళ్లపత్ర గ్రంథాలు, ఇతర పుస్తకాలు ఇంట్రస్ట్‌గా చదువుతారు. మా అబ్బాయి ఇషాన్ 8 తరగతి చదువుతున్నాడు. పంచతంత్ర, ధర్మపరిచయం కథలు చదివిస్తాను. బయట నుంచి ఎక్కువగా కొని ఇస్తాను, ఏకాగ్రత పెరగాలన్న వాటర్ అవర్ ఎలా పెడుతున్నారో? లైబ్రరీ అవర్ 45 నిమిషాలు ప్రతీ స్కూల్‌లో అమలు చేయాలి. ఒకప్పుడు లైబ్రరీ అవర్ ఇచ్చేవారు. ప్రతీ స్కూల్‌లో రీడింగ్‌కు ఒక పీరియడ్ (లైబ్రరీ అవర్) ఇచ్చి, అన్ని బుక్స్ అందుబాటులో ఉండాలి. తద్వారా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు పెరుగుతుంది.

- డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, మహిళా,శిశు సంక్షేమశాఖ జిల్లా బాలల సంరక్షణాధికారి

నా ఇంట్లో ర్యాక్‌లోనే 400 పుస్తకాలున్నాయి



నాకు 20 ఏళ్ల వయస్సు నుంచి పుస్తకాలు రోజూ చదవడం వ్యాపకంగా మారింది. స్వామి వివేకానంద, మహాభారత,రామయాణ గాధలు,రమణ మహర్షి ఆశ్రమ లేఖలు, సైకాలజీ, డీవీ పట్టాభి రామ్, సినిమా హీరోలు మురళీమోహన్, శోభన్ బాబుల పుస్తకాలు చదివా. ఇటీవల సుఖనిద్ర పుస్తకం చదివా. నా దగ్గర ఉన్న పుస్తకాలను అనాధలకు, మెడిటేషన్ పుస్తకాలను తూర్పు గోదావరి జిల్లా లైబ్రరీకి ఇచ్చా. పుస్తకం పంచడం అంటే జ్ఞానాన్ని పంచడమే. నా ఇంట్లోని ర్యాక్‌లో 400 పుస్తకాలున్నాయి. శివాజీ మహరాజ్ కథలు, సర్వీస్ మేటర్స్, ఇతర రచయితలు పుస్తకాలు అన్నీ ఉన్నాయి. నా పిల్లలు చిన్నప్పటి నుంచి చదవే అలవాటు ఉంది. వారి ఏది అడిగినా కొని ఇస్తాను.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.పాండురంగారావు

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం పంచాయతీ శివారు స్తంభం చెరువు గ్రామంలో రూ.8.40 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు శంకుస్థాపన చేశారు. డీసీ మాజీ చైర్మన్ లింగమనేని బాను ప్రసాద్, మండల జనసేన కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, వార్డుసభ్యులు రెడ్డి జగన్మోహనరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



పెదలంకలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు/ కలిదిండి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం వింజరం, శ్యామలాంబపురం, కలిదిండి మండలం కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల రహదారులు సైతం నిర్మాణం చేయలేకపోయారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కైకలూరు నియోజకవర్గంలోనే రూ.38 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. మరో నాలుగు ఏళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో మట్టిరోడ్డు లేకుండా చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ ధర్మరాజుల నాగమ్మ, ఎంపీపీ అడవి కృష్ణ, పాల్గొన్నారు. కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో రూ.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కొండంగిలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య పరిష్కరిస్తామన్నారు. నర్సాపురం నుంచి పెదలంక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విన్నవించగా ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, అండ్రాజు శ్రీనివాస్, అంకాల దుర్గా ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



చాట్రాయిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన పదో తరగతి పరీక్షలు

ముదినేపల్లి/ కలిదిండి/ నూజివీడు టౌన్/చాట్రాయి/ఆగిరిపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం ముదినేపల్లి మండలంలో సోషల్ పరీక్షకు 99.5 శాతం విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 631 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 627 మంది హాజరయ్యారని ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. కలిదిండి మండలంలో కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట పరీక్షా కేంద్రాల్లో 10 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 836 మందికి 826 మంది హాజరయ్యారన్నారు. ఆరుతెగలపాడు, భాస్కరావుపేట పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ రామకృష్ణ సందర్శించి పరిశీలించారు. సాంఘిక శాస్త్ర పరీక్షకు నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం 149 మంది గైర్హాజరైనట్లు నూజివీడు డీవైఈవో సేవియా తెలిపారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 280 మందికి గాను 279 మంది, ఆర్సీఎం పరీక్షా కేంద్రంలో 160 మందికి 155 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరు అయ్యారని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. ఆగిరిపల్లి మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు మొత్తం 569 మందికి గాను 9మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి సర్వేశ్వరరావు తెలిపారు.



ముదినేపల్లిలో పదో తరగతి పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థినులు

బావాజీమఠంలో 4 నుంచి.. కోదండ రామస్వామి తిరు కల్యాణోత్సవాలు



ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలోని బావాజీ మఠంలో కోదండ రామస్వామి తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 4 నుంచి ప్రారంభమై 8 వరకు జరుగుతాయి. ఆ మేరకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4న కోదండ రామస్వామిని, సీతమ్మను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయడం, 5న హోమం, అశ్వ వాహనంపై గ్రామోత్సవం, 6న శ్రీరామనవమి వేడుకలు, బంజారీల ఆది గురువులు సంత్ సేవాదాస్ మహారాజ్, గురుజగ్ మల్ దాస్ మహారాజ్‌లకు మఠం సంప్రదాయం ప్రకారం జోధ్ పూజలు, అన్నసమారాధన, కోదండ రామ స్వామి కళ్యాణోత్సవం, 7న స్వామివార్ల రథోత్సవం, 8న హోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో ఏసునాయుడు తెలిపారు. శ్రీరా మనవమి రోజున ఇతర జిల్లాల నుంచి బంజారీలు వచ్చి తమ గురువులకు పూజలు జరుపనున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 'సింగరాయపాలెం బావాజీ మఠంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఓ విశిష్టత ఉంది. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం జరిగే కోదండ రామస్వామి తిరు కల్యాణోత్సవాన్ని తిలకించడమే మహాభాగ్యమని అర్చకుడు ఆచూరి రంగనాథాచార్యులు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక ఇతర జిల్లా నుంచి భక్తులు వచ్చి అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు నాగ ప్రతిమలకు పూజలు జరిపి పాల పొంగళ్లతో సుబ్రహ్మణ్యేశ్వరుడి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానం ఈవో గంగాశ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, కోట శివశంకర శర్మ, రుద్రపాక బాల గంగాధర తిలక్ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో మృతి



కలిదిండి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పడమటిపాలెం పంచాయతీ పరిధి బర్రెం కెలగరువుకు చెందిన దండే విజయ కుమార్ (44) మంగళవారం ఇంటి వద్ద కుళాయి మోటారు వైర్ చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసం చేసిన నిందితుడి అరెస్టు

ముదినేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక యువతిని మోసం చేసిన కేసులో పోతుమర్రుకు చెందిన దండుబోయిన రామాంజనేయులను మంగళవారం డీఎస్పీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేయడమే కాకుండా తక్కువ కులస్థురాలవంటూ దూషించిన అతనిపై ఇటీవల కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు. రామాంజనేయులును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

పెన్షన్ల పంపిణీ

ముదినేపల్లి/కలిదిండి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ముదినేపల్లి మండలంలో 96 శాతం జరిగింది. మండలంలోని 8,765 మంది పెన్షనర్లకు రూ.3.80 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 8,300 మందికి రూ.3.70 కోట్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. పలు గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పార్టీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, దావు నాగరాజు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు పెన్షన్లు పంపిణీ చేశారు. కలిదిండిలో మంగళవారం కూటమి నాయకులు అధికారులతో కలసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 90 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. మిగిలిన 10 శాతం బుధవారం పూర్తి చేస్తామన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు సానా సతీష్, బండి రహమతుల్లా, ఫారుక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు

వెలుగు కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ

ఆగిరిపల్లి, ఏప్రిలో 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, ఎన్యూమరేటర్లకు మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఏపీఎం దయాల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు వార్షిక ప్రణాళికల తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. సీసీలు దివ్య, రజని, క్లస్టర్ ఎన్యూమరేటర్స్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

చాట్రాయి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 11 మందికి స్పౌజ్ పెన్షన్లు మంజూరు కాగా మంగళవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. భర్త పెన్షన్ తీసుకుంటూ మరణిస్తే భార్యకు బదిలీ చేయటాన్ని స్పౌజ్ పెన్షన్ అని పిలుస్తారు. చనుబండలో నాగుల శాంతమ్మకు జనవరిలో పెన్షన్ మంజూరు కాగా ఎన్నికల కోడ్ కారణంగా సొమ్ము ఇవ్వలేదు. ఇప్పుడు 3 నెలల పెన్షన్ రూ.12 వేలు మంజూరు పత్రాన్ని టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, చీదిరాల మారేశ్వరరావు, నక్కా రాము అందజేశారు.

6 నుంచి రఘునాథస్వామి తిరు కల్యాణోత్సవాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథ్ స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఈనెల 6 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న రఘునాథస్వామిని పెండ్లి కుమారుని చేయడంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7న అంకురార్పణ వైనతేయ ప్రతిష్ఠ, 8న దేవతల ఆహ్వానం, బలిహరణ, 9న స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం అన్న సమారాధన, 10న ఊంజల్ సేవ, 11న రథోత్సవం, 12న గరుడ వాహనం, 13న శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటులో ఉద్రిక్తత

సూరంపాలెంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల తోపులాట



సూరంపాలెంలో ఇరువర్గాల మధ్య తోపులాట

చాట్రాయి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చనుబండ శివారు సూరంపాలెం దళితవాడలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు విషయంలో సోమవారం సాయంత్రం టీడీపీ వైసీపీ వర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అంబేడ్కర్, వైఎస్సార్, విగ్రహాల పక్కన ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో కార్యకర్తలు పనులు చేస్తుండగా వైసీపీ నాయకులు కార్యకర్తలు అడ్డుకున్నారు. గత నెల 18వ తేదీన ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకులు భూమిని ఎంపిక చేశారు. ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కుదరదని, వేరే స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని వైసీపీ నాయకులు చెప్పటంతో, ఇది గ్రామానికి చెందిన స్థలమని ఇక్కడే ఎన్టీఆర్ విగ్రహం నిర్మిస్తామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. వివాదం జరుగుతుండగా ఇరు పార్టీల పెద్దలు కలుగజేసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించడంతో గొడవ సద్దుమణిగింది. మంగళవారం రాత్రి ఇరు వర్గాలను చాట్రాయి పోలీస్‌స్టేషన్‌కు పిలిచి నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్‌ఐ డి రామకృష్ణ మాట్లాడారు. గొడవలు పడవద్దని టీడీపీ వైసీపీ నాయకులకు సూచించారు.

చెరువులకు సాగర్ జలాలు విడుదల



చాట్రాయి పెద్ద చెరువులోకి వెళుతున్న సాగర్ జలాలు

చాట్రాయి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ వేంపాడు మేజర్ ద్వారా చాట్రాయి మండలంలో చెరువులకు నీరు విడుదల చేయటంతో రైతులు ప్రజలు హర్షం చేస్తున్నారు. జోన్-3లో ఉన్న వేంపాడు మేజర్‌కు ఏటా నవంబర్, డిసెంబరు నెలల్లో నీరు విడుదల చేసి చెరువులు నింపుతారు. కానీ ఈఏడాది నీటి విడుదలలో తీవ్ర జాప్యం జరిగి రబీ పంట ఆఖరులో నీరు చాలక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం పంటలు లేకపోయినా చెరువుల్లో నీరు ఉంటే పశువుల తాగునీరు ఇబ్బంది ఉండదని, భూగర్భ జలాలు పెరిగి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తదని రైతులు ప్రజలు అంటున్నారు

ఉపాధి పనులకు అధికంగా కూలీలు హాజరుకావాలి



ఉపాధి పనులపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి లేకుండా ఏ ఒక్క కుటుంబం ఉండకూడదని ఎంపీడీవో చెన్న రామవేంద్రరావు అన్నారు. నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌లో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏ ఒక్కరూ ఉపాధి లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అత్యధికంగా ఉపాధి పనులకు కూలీలు హాజరయ్యేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆయన ఆదేశించారు.



చాట్రాయిలో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలని ర్యాలీ

చాట్రాయి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం నిస్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలు బయటకు తీయాలని కోరుతూ క్రైస్తవ సంఘాలు మంగళవారం చాట్రాయిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ ఎంతో మంది అనాథ పిల్లలను చదివిస్తున్నారని, నిత్యం పేదలకు సేవ చేస్తూ జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారని, అటువంటి గొప్ప వ్యక్తి ఈవిధంగా మృతి చెందటం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జనార్దనవరంలో మంగళవారం జరిపిన దాడిలో ఐదు లీటర్లు సారా స్వాధీనం చేసుకొని బొలికొండ చెన్నారావుపై కేసు నమోదు చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. పలు ఎక్సైజ్ కేసుల్లో నేరస్తుడు పోలవరానికి చెందిన పిల్లి దుర్గాప్రసాద్‌ను తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పది మంది బైండోవర్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుబ్బారావు హెచ్చరించారు. మంగళవారం పల్లెర్లమూడి, మర్రిబంధం, సిద్ధార్థనగర్ గ్రామాలలో ఎక్సైజ్ నేరాలలో పాత నేరస్తులు పదిమందిని బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని జడ్పీ హైస్కూల్ సమీపంలో అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ పీఎస్సీ ప్రసాద్ హాజరయ్యారు. డీటీ పవన్ కుమార్, పాతూరి రవి, నక్కనబోయిన వేణు, దొండపాటి ఏసుపాదం, చౌటపల్లి విక్టర్ బాబు, మండల బీజేపీ అధ్యక్షుడు కొవ్వలి బాబురావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234